తెలుగు దినపత్రిక
https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

Published From: Medchal-Malkajgiri
సంపుటి: 5 సంచిక: 86 పేజీలు : 08 బుధవారం 18-3-2026 వెల: 3 రూ/.

## మేం చేస్తున్న పనులకు ధన్యవాదాలు చెప్పాలి: కోమటిరెడ్డి

2లో..



## సీఎం సంతకానికే దిక్కులేకపోతే ఎలా

- ఎక్కడ పోయిందో సిట్ ద్వారా వెతికి పట్టండి - ఇచ్చిన హామీలను తుంగలో తొక్కింది నిజం కాదా
- గత గవర్నర్ ప్రసంగాలకు..నేటికి ఏం తేడా - గవర్నర్ ప్రసంగంలోనే తప్పులు దొర్లితే ఎలా
- ఐటి సెక్రటరీ ఎవరో వారిని తొలగించండి - ఢిల్లీకి వెళ్లి నిధులు తేకుండా..నిధులు ఇచ్చి వస్తున్నారు
- 420 వరల్డ్ కప్ పెడితే కాంగ్రెస్ ఫస్ట్ వస్తుంది - కాంగ్రెస్ గ్యారెంటీలకు..ప్రభుత్వానికి జీరో వాల్యూ
- ధన్యవాద తీర్మానంపై ఎందుకు ధన్యవాదాలు తెలపాలి
- తెలంగాణ అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై కెటిఆర్ విసుర్లు



**హైదరాబాద్,:** తెలంగాణ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాటల యుద్ధం నడిచింది. చర్చలో కెటిఆర్ మాట్లాడుతుండగా పలు సందర్భాల్లో మంత్రులు ఆయన ప్రసంగానికి అడ్డుపడ్డారు. ఈ క్రమంలో నేనే రాజు.. నేనే మంత్రి' అని మిడిసిపడ్డ వారు సంపద మూటగట్టుకు పోలేరని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఎన్నికల హామీ దస్త్రంపై సీఎం సంతకం చేశారని 2023 నాటి గవర్నర్ ప్రసంగంలో ఉంది. ఏళ్లు గడిచినా సీఎం సంకల్పం, చిత్తశుద్ధి ఏమైంది?తొలి

2లో..



## ప్రశ్నోత్తరాలు లేకుండా అసెంబ్లీ సమావేశాలు

### - బీఆర్ఎస్ విమర్శలు, బీజేపీ వినూత్న నిరసన

**హైదరాబాద్** తెలంగాణ రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు రెండో రోజు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం 10 గంటలకు శాసనసభ, శాసనమండలి ఉభయ సభలు తమ కార్యకలాపాలను మొదలుపెట్టాయి. అయితే, మొదటిరోజు షెడ్యూల్‌లో భాగంగా క్వశ్చన్ అవర్‌ను రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

**ప్రశ్నోత్తరాలు రద్దు చేసిన స్పీకర్..**

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై వెంటనే చర్చించాలని కోరుతూ బీఆర్ఎస్ వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టగా స్పీకర్ తిరస్కరించారు. సభలో ప్రశ్నోత్తరాలను స్పీకర్ రద్దు చేయడంతో కాసేపు గందరగోళం నెలకొంది. బీజేపీ ప్రజా ప్రతినిధులు అసెంబ్లీ బయట వినూత్న రీతిలో నిరసన తెలిపారు. బషీర్‌బాగ్ నుంచి అసెంబ్లీ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. రైతుల నుంచి సేకరించిన దరఖాస్తులను తోపుడు బండిపై ఉంచి అమరవీరుల స్థూపం వరకు తీసుకెళ్లి ప్రభుత్వం రైతుల పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ నిరసన తెలిపారు. బీజేపీ నేతలు రైతుల దరఖాస్తులతో సభలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా వారిని అడ్డుకున్నారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వం పలు కీలక వార్షిక నివేదికలను సభా సమక్షంలో ఉంచనుంది. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ సమాచార కమిషన్ వార్షిక నివేదికలను సభకు సమర్పించనుండగా, మంత్రి శ్రీధర్ బాబు తెలంగాణ వాణిజ్య ప్రోత్సాహక సంస్థ లిమిటెడ్ (8వ నివేదిక), తెలంగాణ రాష్ట్ర చర్మ పరిశ్రమ అభివృద్ధి సంస్థ లిమిటెడ్ (4వ నివేదిక) నివేదికలను ప్రవేశపెట్టనున్నారు. ఈ నివేదికలపై సభలో చర్చ జరిగే అవకాశం ఉంది. ఉభయ సభల్లోనూ గవర్నర్ ప్రసంగంపై సభ్యులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. నిన్న, నేడు గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే

2లో..

## రాష్ట్రం కోసం ఎన్నిసార్లయినా ఢిల్లీ వెళతాం

- అభివృద్ధి ఎజెండాగా మా ప్రయాణం
- జాతీయ పార్టీగా ఢిల్లీకి వెళుతూనే ఉంటాం
- కెటిఆర్ వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు

2లో..



## కెటిఆర్ విమర్శలను తిప్పికొట్టిన మంత్రులు

- గత ప్రభుత్వ పాపాలను మరచి మాట్లాడొద్దు
- ఏమేం చేశామో లెక్కలతో సహా వివరిస్తామన్న భట్టి

2లో..



## జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

### - మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

హైదరాబాద్,: జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, వారి సమస్యల పరిష్కారానికి సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి





## ప్రజాపోరాటాలు తప్పక విజయం సాధిస్తాయి

### - వెలుగుమట్ల ఘటనపై కవిత ట్వీట్

**హైదరాబాద్** తెలంగాణలో సంచలనం సృష్టించిన వెలుగుమట్ల ఇళ్ల కూల్చివేతల వ్యవహారంలో ఎట్టకేలకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించిన సంగతి తెలిసిందే. అక్కడ ఇళ్లు కోల్పోయిన వారిలో కొంతమందికి ఇళ్ల పట్టాలు ఇస్తామని సర్కార్ ప్రకటించింది. ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత, విమర్శలు వెల్లువెత్తాయి. ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు వెలుగుమట్లకు చేరుకుని బాధితులకు అండగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేశాయి. ఈ క్రమంలోనే తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కూడా అక్కడికి చేరుకుని బాధితుల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ఎక్స్ వేదికగా సుదీర్ఘ పోస్ట్ పెట్టిన కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ట్వీట్ చేసిన కవిత 'ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో 750 మంది పేదల ఇండ్లను కూలగొట్టిన అరాచక కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ జాగృతి, ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షులు డా. విశారధన్ మహారాజ్ గారి ఆధ్వర్యంలో చేపట్టిన సంయుక్త పోరాటాల ఫలితంగా ప్రభుత్వం దిగివచ్చింది. ఇండ్లు

2లో..

## మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డిపై కేసీఆర్ సీరియస్

### - షోకాజ్ నోటీసులు జారీ చేసిన బీఆర్ఎస్



**హైదరాబాద్** మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ బిగ్ షాక్ ఇచ్చింది. మెయినాబాద్ ఫాం హౌస్‌లో డ్రగ్స్ కేసుకు సంబంధించి ఆరోపణల నేపథ్యంలో రోహిత్ రెడ్డిక షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. గడువులోగా సంతృప్తికరమైన వివరణ ఇవ్వకపోతే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని షోకాజ్ నోటీసుల్లో బీఆర్ఎస్ హెచ్చరించింది. డ్రగ్స్ కేసులో మీ ప్రమేయం ఉన్నట్లు మీడియా ద్వారా వార్తలు

2లో..

## డ్రగ్స్ టెస్టులకు రేవంత్ రెడ్డి సిద్ధం

### - కేసీఆర్, కేటీఆర్ వస్తారా..?

- తెలంగాణ రాజకీయాల్లో కలకలం రేపుతున్న డ్రగ్స్ వ్యవహారం
- డ్రగ్స్ విచ్చలవిడిగా దొరకడానికి పదేళ్ల బీఆర్ఎస్ పాలనే కారణమన్న మహేశ్ గౌడ్
- ప్రజాప్రతినిధులందరూ డ్రగ్స్ పరీక్షలు చేయించుకోవాలని వ్యాఖ్య
- ఫామ్‌హౌస్‌లో పట్టుబడింది మీ నాయకుడు కాదా? అని ప్రశ్న




**హైదరాబాద్** మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసు తెలంగాణ రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. ఈ అంశంపై శాసనమండలిలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. డ్రగ్స్ వ్యవహారంలో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. టీపీసీసీ చీఫ్, కాంగ్రెస్

2లో..

## లోక్‌భవన్‌లో ఉగాది ఉత్సవాలు

### - జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన గవర్నర్




**హైదరాబాద్,:** తెలంగాణ లోక్‌భవన్‌లో ఉగాది ఉత్సవాలు నిర్వహించారు. గవర్నర్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆహుతులను స్వయంగా స్వాగతించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఇక్కడికి

2లో..

## 800 కిలోల కుళ్లిన చికెన్ సీజ్

- బార్లు, హోటళ్లకు సప్లై
- ముషీరాబాద్‌లోని చికెన్ మార్ట్‌లో పోలీసుల తనిఖీలు
- షేక్ షకీల్ అనే వ్యక్తి కుళ్లిన చికెన్‌ను విక్రయిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న వారాసిగూడ పోలీసులు

**హైదరాబాద్** ఒకవైపు కల్తీ రాయుళ్లు రోజురోజుకూ తీవ్రంగా రెచ్చిపోతున్నారు. కనిపించిన ప్రతీ ఆహార పదార్థాన్ని కల్తీ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఈ సమయంలోనే కుళ్లిపోయిన ఆహార పదార్థాలను కూడా ప్రజలకు అందిస్తూ వారి పాలిట యమదూతలుగా మారుతున్నారు. ఈ క్రమంలోనే హోటళ్లు, రెస్టారెంట్లలో చికెన్, మటన్ వంటి మాంసాలను రోజుల తరబడి నిల్వ ఉంచుతూ అవి కుళ్లిపోయిన తర్వాత వంట చేస్తున్నారు. ఇలాంటి ముఠానే ఇప్పుడు హైదరాబాద్‌లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) అధికారుల తనిఖీల్లో దొరికిపోయింది.ముషీరాబాద్ పార్శిగుట్టలో బాపూజీనగర్‌లోని ఏ 1 ఫ్రెష్ చికెన్ మార్ట్‌పై వారాసిగూడ పోలీసులతో కలిసి జీహెచ్ఎంసీ అధికారులు దాడి చేశారు. ఈ తనిఖీల్లో 800 కిలోల కుళ్లిపోయిన చికెన్ మాంసాన్ని నిల్వ చేసినట్లు గుర్తించారు. ఆ షాపు ఓనర్ షేక్



షకీల్ పాడైపోయిన చికెన్‌ను అమ్ముతున్నట్లు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడ తనిఖీలు చేపట్టి దాన్ని సీజ్ చేశారు. ఇలా భారీ ఎత్తున నిల్వ చేసిన చికెన్‌ను.. హైదరాబాద్‌లో ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లు, బార్‌లకు సరఫరా చేస్తున్నట్లు అధికారుల విచారణలో వెల్లడైంది.అయితే స్వాధీనం

2లో..

## హ్యామ్ రోడ్ల పేరుతో 18వేల కోట్ల కుంభకోణం

- కమిషన్ల కోసం 10 శాతం మొబిలైజేషన్ చెల్లింపు
- కాంగ్రెస్ ఎన్నికల ఖర్చు కోసం రేవంత్ సన్నాహాలు
- మాజీమంత్రి, బిఆర్ఎస్ నేత హరీష్ రావు ఆరోపణలు

**హైదరాబాద్,:** తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి సంచలన ఆరోపణలు వెలువడ్డాయి. అసెంబ్లీలో జరిగిన చిట్‌చాట్ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు రాష్ట్రంలో భారీ కుంభకోణం జరుగుతోందని ఆరోపించారు. హ్యామ్ రోడ్ల పేరిట సుమారు రూ.18 వేల కోట్ల స్కాం జరుగుతోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆనాడు మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు ఇస్తే రేవంత్ రెడ్డి వద్దు అని గొడవ పెట్టారని.. ఇప్పుడు 10 శాతం మొబిలైజేషన్ ఇస్తున్నారని హరీష్ రావు



2లో..

# సీఎం సంతకానికే దిక్కులేకపోతే ఎలా

క్యాబినెట్‌లోనే ఆరు హామీలకు చట్టబద్ధత కల్పిస్తామన్నారు. బహిరంగ వేదికపై సీఎం సంతకం చేసిన దస్త్రం ఏమైందన్నారు. సీఎం ఫైల్‌కే దిక్కు లేకపోతే కాంగ్రెస్ మాటలు ఎవరు నమ్ముతారని, మాయమైన దస్త్రం కోసం సిట్ ఏర్పాటు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ఎవరు ధన్యవాదాలు చెప్పాలి.. ఎందుకు చెప్పాలని ప్రశ్నించారు. రైతులు, వితంతువులు, వృద్ధులు, నిరుద్యోగులు ఎవరు ధన్యవాదాలు చెప్పాలని నిలదీశారు. గ్యారంటీ కార్డులను భద్రపరచుకోవాలని చెప్పి మోసం చేయలేదా అని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు ఎక్కడ దాచిపెట్టాలో చెప్పాలన్నారు.కాంగ్రెస్ నేతలు దిల్లీ వెళ్లి నిధులు తెస్తారనుకుంటే.. నిధులు ఇచ్చి వస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. గాదులు, ఉషస్సులు వస్తున్నాయ్.. పోతున్నాయ్.. ప్రజల జీవితాల్లో వెలుగులేవని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ ప్రశ్నించారు. ప్రభుత్వం డిజాస్టర్ పాలన సాగిస్తోందని మండిపడ్డారు. ఎగ్గొట్టు, కూలగొట్టు, చెడగొట్టు.. ఇదీ కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎగనామాలు.. పంగనామాలు.. ఇదేనా ఇందిరమ్మ రాజ్యమని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీల కోసం కోటి 25 లక్షల మంది చేసుకున్న ప్రజాపాలన దరఖాస్తులు ఏమయ్యాయని కేటీఆర్ ప్రశ్నించారు. గ్యారంటీ కార్డులు బాకీ కార్డులుగా మారి వెక్కిరిస్తున్నాయని అన్నారు. ఇండియా క్రికెట్‌లో టీ20 వరల్డ్ కప్ గెలిచింది.. అదే 420 వరల్డ్ కప్ పెడితే కాంగ్రెస్ ఫస్ట్ వస్తుందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం చారాణా పని చేసి.. బారాణ చేసినట్లుగా చెప్పుకుంటుందని అన్నారు. నేనే రాజు.. నేనే మంత్రి అని మిడిసి పడితే మూటకట్టుకుని పోతారని వ్యాఖ్యానించారు.

సంక్షేమ పథకాలకు సంబంధించి తొలి సంతకం చేసిన ఫైల్ ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. మాయమైన ఫైల్ కోసం సిట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మూసీలో ముంచుతున్న ఇండ్లకు జీరో వాల్యూ కాదు.. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక చేసిన తొలి సంతకానికి జీరో వాల్యూ అని తెలిపారు. కాంగ్రెస్ గ్యారంటీ కార్డులకు, డిక్లరేషన్లకు ప్రజల్లో జీర వాల్యూ అని అన్నారు. విశ్వసనీయత కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వానికి జీరో వాల్యూ అని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడితే కర్ణుడిని అని చెప్పుకంటున్నాడని.. ఆయన ఎన్నికల ముందు దానకర్ణ.. ఇప్పుడు కుంభకర్ణ అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. డిక్లరేషన్ల కోసం ఢిల్లీ నుంచి విమానాలు వేసుకుని వచ్చారని.. కానీ వాటిని అమలు మాత్రం చేయడం లేదని అన్నారు. ఇక తెలంగాణ ప్రజల సొమ్మును పక్క రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రచారం కోసం వాడుకుంటున్నారని మండిపడ్డారు.పాలకులు ప్రజలకు ఇచ్చిన మాటను నెలబెట్టుకోవాలని కేటీఆర్ తెలిపారు. పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగం, అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి విలువ ఉండాలని అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ప్రాధాన్యత ఉంటుందని వ్యాఖ్యానించారు. కానీ గవర్నర్ ప్రసంగానికి విలువ లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండున్నరేండ్లలో రెండున్నర లక్షలు అందుకున్న కుటుంబాన్ని చూపించాలని డిమాండ్ చేశారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు. మహిళలకు ఇస్తామన్న రూ.2500 హామీ ఏమైందని అడిగారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ అన్నారు.. ఏమైందని నిలదీశారు. గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం లేదని మండిపడ్డారు. గ్యారంటీలు, హామీల అమలు విషయంలో ఎందుకింత నిర్లక్ష్యమని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో రేషన్ కార్డులు ఇవ్వలేదా అని కేటీఆర్ ప్రశ్నించారు. రేషన్ కార్డులు ఇవ్వలేదని నిండు సభలో ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పలేదా అని అడిగారు. పదే పదే అబద్దాలు వల్లె వేస్తే లాభం ఎవరికి అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పరనింద ఆత్మస్తుతి మానుకోవాలని హితవుపలికారు. మోసాల కాలంలో నిజాలు చెప్పడమే అతి పెద్ద విప్లవం కాదా అని వ్యాఖ్యానించారు. ఇకపోతే 2023లో ఐటీ ఉద్యోగుల సంఖ్య 9.46లక్షలు. తాజాగా గవర్నర్ ప్రసంగంలో ఆ సంఖ్య 9.39లక్షలుగా పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 7వేల ఉద్యోగాలు తగ్గాయనేది వాస్తవమా? కాదా?ఉద్యోగాలు ఎందుకు తగ్గాయి? బీఆర్ఎస్ హయాంలో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తక్కువగా వచ్చినా రాష్ట్రాన్ని దీటుగా నిలబెట్టాం. మనది కేంద్రంపై ఆధారపడే రాష్ట్రం కాదని కేటీఆర్ అన్నారు.

ఈ క్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. మహిళా సంఘాలకు రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చినట్లు అసెంబ్లీలో భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు. 'రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చినట్లు జీవో చూపించండి. ఇక్కడే రాజీనామా చేసి నేను వెళ్లిపోతాను' అంటూ సవాల్ విసిరారు. అసెంబ్లీని తప్పుదోవ పట్టించవద్దంటూ డిప్యూటీ సీఎంకు సూచించారు. భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు అబద్ధమని.. రాష్ట్రంలోని మహిళలంతా చూస్తున్నారని కేటీఆర్ అన్నారు. రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామన్నది తప్పు మాట అని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. వంద రోజుల్లో 6 గ్యారంటీలని సినిమా చూపించిందే కాంగ్రెస్ అని.. సోనియా గాంధీని బలిదేవత అని తాము అనలేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

## కెటిఆర్ విమర్శలను తిప్పికొట్టిన మంత్రులు

హైదరాబాద్,:గవర్నర్ ప్రసంగంపై కెటిఆర్ మాట్లాడుతున్నంత సేపు మంత్రులు పలు అంశాల్లో తిప్పి కొట్టారు. గత హయాంలో చేసిన తప్పులు మరచి, ప్రభుత్వాన్ని తప్పుపట్టడమే లక్ష్యంగా చేసుకున్నారని అన్నారు. చేస్తున్న అభివృద్ధిని అభినందించి, తగిన సూచనలు చేస్తే మంచిదని అన్నారు. కేటీఆర్ దారి తప్పి మాట్లాడుతున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శించారు. 'పదేళ్లు అధికారంలో ఉండి మహిళా సాధికారతను గాలికి వదిలేశారు. మీ ఇంటి ఆడబిడ్డపై మీకు ఏ గౌరవం ఉందో రాష్ట్రమంతా చూస్తోంది. కానీ రాష్ట్ర మహిళల గౌరవంపై చిన్న చూపు వద్దు. రాష్ట్రాన్ని అభాసుపాలు చేయాలనే ఆలోచన మంచిది కాదని భట్టి విక్రమార్క అన్నారు. తమ ప్రభుత్వం హామీలు నెరవేర్చడం లేదని బీఆర్ఎస్ ఆరోపించడం సరికాదని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ది చేకూరుతుందనేది లెక్కలతో చెబుతామని తెలిపారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. అర్హులైన 53 లక్షల మందికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 1.06 కోట్ల మందికి సన్న బియ్యం ఇస్తున్నామని వివరించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పకుండా ప్రభుత్వాన్ని కేటీఆర్ విమర్శిస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అందరికీ ఇస్తామన్నారు.. ఇచ్చారా అని ఉపముఖ్యమంత్రి ప్రశ్నించారు. రూ.22,500 కోట్లతో ఒక్కో నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తున్నామని ఉపముఖ్యమంత్రి వెల్లడించారు. రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో వేశామని డిప్యూటీ సీఎం తెలిపారు. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. 'మీలా మేము ఇంటికో ఉద్యోగం ఇస్తామని ఇవ్వకుండా వదల్లేదు. మూడు ఎకరాలు ఇస్తామని ఇవ్వకుండా వదిలేయలేదు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని మోసం చేయలేదు. మీరు తెచ్చిన అప్పులకు అసలు, వడ్డీలు కడుతూనే ఈ పనులన్నీ చేస్తున్నాం' అంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## కూకట్ పల్లి దోపిడి కేసు

### - దర్యాప్తు ముమ్మరం

**కూకట్ పల్లి** అజీముద్దీన్, కుస్రుఫ్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కూకట్పల్లి మెట్రో స్టేషన్ పిల్లర్ నెంబర్ 836 వద్ద నలుగురు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలపై వచ్చి, వారిపై కారం చల్లి కోటి రూపాయల నగదును ఎత్తుకెళ్లినట్లు ఎసీపీ నరేష్ రెడ్డి తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఇన్స్పెక్టర్ సుబ్బారావు తన బృందంతో దర్యాప్తు ప్రారంభించినట్లు చెప్పారు. మూడు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, సీసీటీవీ కెమెరాల ఆధారంగా విచారణ కొనసాగిస్తున్నామని, డబ్బు యాక్కడ నుంచి వచ్చాయి ఎక్కడికి వెళ్తున్నాయి అనే కోణంలో కూడా దర్యాప్తు ముమ్మరం చేసినట్లు నరేష్ రెడ్డి వెల్లడించారు. ఐటీ అధికారులు రంగంలోకి దిగారు. భారీ మొత్తంలో నగదు పట్టుగొడడంపై ఆరా, ఐటి విభాగం అధికారులు అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేసారు. .

## తెలంగాణ సివిల్ సర్వీసెస్ వాలీబాల్ జట్టుకు ఎంపికైన వార్డ్ ఆఫీసర్ రాజుబాబు

**మేడ్చల్...** ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని 6 వార్డు రాజబొల్లారం గ్రామం కి చెందిన పిల్లి బిక్షపతి ఉ జయమ్మ కుమారుడు పిల్లి రాజుబాబు తెలంగాణ సివిల్ సర్వీసెస్ వాలీబాల్ జట్టుకు ఎంపిక అయ్యాడు. ఈ నెల 20 నుండి 25 వరకు ఢిల్లీలో జరిగే ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ వాలీబాల్ టోర్నమెంట్లో తెలంగాణ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఈ సందర్భంగా రాజబొల్లారం గ్రామానికి పేరు తీసుకువచ్చిన రాజుబాబును గ్రామస్తులు,నాయకులు అభినందించారు. ప్రస్తుతం రాజుబాబు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అఓఅ లో కుత్బుల్లాపూర్ జోన్ లోని మేడ్చల్ సర్కిల్ -60 లో వార్డ్ ఆఫీసర్ గా నిధులు నిర్వహిస్తున్నారు.

## కూకట్పల్లి హవాలా కేసును ఛేదించిన పోలీసులు

**కూకట్ పల్లి** కూకట్పల్లి హవాలా కేసును పోలీసులు ఛేదించారు. కేసు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇద్దరు అనుమానితులను శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో అదుపులోకి తీసుకున్నారు. శంషాబాద్ నుండి లక్నో కి పారిపోతున్నట్లు నిర్ధారించారు.

## రాష్ట్ర బడ్జెట్లో వృత్తిదారుల సంక్షేమానికి 25వేల కోట్లు కేటాయించాలి

**హైదరాబాద్** రాష్ట్ర బడ్జెట్లో వృత్తిదారుల సంక్షేమానికి 25వేల కోట్లు కేటాయించాలని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. బడ్జెట్లో వృత్తిదారుల సంక్షేమానికి 25 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని కోరుతూ హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద రాష్ట్ర చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో చేతి వృత్తిదారులు మహా ధర్నాను చేపట్టారు.

ఈ మహా ధర్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, చేతి వృత్తి దారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ రమణ హాజరై మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్న చేతి వృత్తుదారుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల్లో చేతి వృత్తిదారులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై ప్రభుత్వ వైఖరి స్పష్టమవుతుందని పేర్కొన్నారు. చేతి వృత్తుల్లోకి పెట్టుబడిదారులు ప్రవేశించడంతో ఆయా వృత్తులు వ్యాపారంగా మారి వృత్తిదారుల జీవితాలు దుర్భరంగా మారుతున్నారు.

ప్రభుత్వం కేవలం కల్లు గీత కార్పొరేషన్కు మాత్రమే 17 కోట్లు విడుదల చేసిందని ఆ నిధులను కూడా పూర్తిగా సద్వినియోగ పరచలేదని రాష్ట్ర చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ మేకపోతుల వెంకటరమణ ఆరోపించారు. ప్రభుత్వం చేతి వృత్తిదారుల కార్పొరేషన్లన్నింటికీ నిధులు కేటాయించడంతోపాటు ఆయా నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## లోక్‌భవన్‌లో ఉగాది ఉత్సవాలు

విచ్చేసిన విశిష్ట అతిథులకు, ఆహ్వానితులకు, లోక్ భవాని పరివార్ సభ్యులకు మరియు కళాకారులకు పేరు పేరున నాహృదయపూర్వక నమస్కారములు అని అన్నారు. మీ అందరికీ శ్రీ 'పరాభవ' నామసంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు అని తెలిపారు. ఈ నూతన సంవత్సరం మీ కుటుంబాల్లో ధన, ఆరోగ్య, సంతోషాలను నింపాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. అరవై ఏళ్ల కాలచక్రంలో 'పరాభవ' 40 వ సంవత్సరం.. పరాభవ అంటే.. మనలోని అహంకారాన్ని, చెడు ఆలోచనలను ఓడించి, విజయానికి పునాది వేసేదని అర్థం. ఈ సంవత్సరం మనందరి అభ్యున్నతి సంవత్సరంగా మారుతుందని నా విశ్వాసం అని గవర్నర్ శు క్లా ఆకాంక్షించారు. మన తెలంగాణ రాష్ట్రం మరియు దేశం సర్వతోముఖాభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు. గత అనుభవాల నుండి నేర్చుకుంటూ, మరింత నిబద్ధతతో, సేవాభావంతో మన లక్ష్యాల వైపు అడుగులు వేయాలి. ఉగాది అంటేనే కొత్త శకం. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి మన జీవితంలోని కష్ట సుఖాల కలయికను సూచిస్తుంది. ఈ ఏడాది రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలతో తెలంగాణ కళకళలాడాలని మనసారా కోరుకుంటున్నాను అని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క,మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పలువురు అధికారులు పాల్గొన్నారు. ఇదిలావుంటే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ విషయంలో స్పీకర్‌దే తుది నిర్ణయమని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. జీవన్‌రెడ్డిని పార్టీ ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదన్నారు. బడ్జెట్ సమావేశాలకు ప్రతిపక్షనేత కేసీఆర్ రావాలని కోరారు. కేసీఆర్ అనుభవం అసెంబ్లీకి అవసరం. మంత్రుల మార్పులు, చేర్పుల్లో సీఎంకే పూర్తి స్వేచ్ఛ ఉందని శ్రీధర్‌బాబు అన్నారు.

## 800 కిలోల కుళ్లిన చికెన్ సీజ్

చేసుకున్న చికెన్ మాంసం దుర్వాసన రావడంతో పాటు అత్యంత అపరిశుభ్ర ప్రాంతంలో దాన్ని నిల్వ చేసినట్లు పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు గుర్తించారు. అక్కడ ఎలుకలు, పిల్లులు పరిగెడుతున్నాయని పేర్కొన్నారు. మరోవైపు ఏ 1 ఫ్రెష్ చికెన్ షాపు ట్రేడింగ్ లైసెన్స్ గడువు ముగిసిందని విచారణలో అధికారులు గుర్తించారు. అయితే లైసెన్స్ గడువు ముగిసి సంవత్సరం దాటిపోయినా రెన్యువల్ చేయించుకోలేదని అయినా అక్రమంగా కొనసాగిస్తున్నట్లు తేలింది. ఈ నేపథ్యంలోనే నిందితుడైన ఆ షాప్ యజమాని షేక్ షకీల్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు మరింత లోతైన దర్యాప్తు చేపట్టారు. ఒకవైపు ప్రస్తుత వేసవి కాలంలో రోజురోజుకూ చికెన్ ధరలు ఆకాశాన్ని అంటుతుంటే ఇలాంటి వాళ్లు కుళ్లిపోయిన మాంసంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇలా కుళ్లిన చికెన్‌ను నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లకు సప్లై చేస్తున్నారనే విషయం తెలిసిన నగరవాసులు ఇప్పుడు భయం భయంగా బతుకుతున్నారు.

## హ్యామ్ రోడ్ల పేరుతో 18వేల కోట్ల కుంభకోణం

మండిపడ్డారు. ఈ రకంగా రాష్ట్రంలో అతిపెద్ద కుంభకోణం జరుగుతోంది. హ్యామ్ రోడ్ల పేరుతో రూ.18 వేల కోట్ల కుంభకోణానికి తెరలేపారు. రోడ్స్ అండ్ బిల్డింగ్స్ లో రూ.12 వేల కోట్లు, పంచాయతీ రాజ్ డిపార్ట్‌మెంట్‌లో రూ.6 వేల కోట్లు కలిపి భారీ స్థాయిలో అవకతవకలు జరుగుతున్నాయి. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు ఇస్తే అప్పటి ప్రతిపక్ష నాయకుడు రేవంత్ రెడ్డి వద్దు అని గొడవ పెట్టారు. ఇప్పుడు అదే ప్రభుత్వం 10 శాతం మొబిలైజేషన్ ఇస్తోంది. ఇందులో కమిషన్లు తీసుకుని ఎన్నికల ఖర్చు కోసం పంపబోతున్నారు. ఈ వ్యవహారం పెద్ద స్థాయి స్కాం గా మారే ప్రమాదం ఉంది' అని ఆరోపించారు.ఈ టెండర్లకు సీఓటీ అనుమతి కూడా అవసరం లేకుండా, డిపార్ట్‌మెంట్ స్థాయిలోనే అనుమతులు ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం 34 టెండర్ ప్యాకేజీలలో ఇప్పటికే 24 టెండర్లు ఓపెన్ చేసినట్లు తెలిపారు. కాంట్రాక్టర్ల మధ్య కుమ్మక్కుతో 20 నుంచి 30 శాతం వరకు అధిక ధరలకు టెండర్లు వేయించారని కూడా ఆరోపించారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపించాలని, ప్రజల డబ్బును కాపాడాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

## రాష్ట్రం కోసం ఎన్నిసార్లయినా ఢిల్లీ వెళతాం

హైదరాబాద్,: కెటిఆర్ వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ.. ఈ విషయాన్ని కేటీఆర్ పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. టెక్నికల్‌గా మాట్లాడితే బీఆర్ఎస్ ఒక్క రూపాయి కూడా రుణం ఇవ్వలేదన్నారు. మహిళలంటే ఎందుకు చులకన అని మంత్రి శ్రీధర్ బాబు ప్రశ్నించారు. మహిళా సాధికారతపై కేటీఆర్ హేళనగా మాట్లాడుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. 'మీరు పావలా వడ్డీ ఇవ్వలేదు.. మేము ఇస్తున్నాం. గోబెల్స్ ప్రచారంలో బీఆర్ఎస్‌ను మించిన వారు ఈ ప్రపంచంలోనే ఎవరూ లేరు. కాంగ్రెస్ తెలంగాణ ఇవ్వకపోతే మీరు ఎక్కడ ఉండేవారు. ఈరోజు కాంగ్రెస్‌పై అడ్డగోలుగా మాట్లాడుతున్నారు' అంటూ కేటీఆర్‌పై మంత్రి శ్రీధర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

గవర్నర్ ప్రసంగంలో ఎంవోయూ, పెట్టుబడులపై ఆయన వివరణ ఇచ్చారు. సిఎం పదేపదే ఢిల్లీకి వెళుతున్నారని కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను మంత్రి తిప్పికొట్టారు. కేంద్రంతో కొట్లాడి అయినా నిధులు తెచ్చి, రాష్ట్రాన్ని బాగు చేస్తామని అన్నారు. ప్రధాన మంత్రిని కలవడంలో తప్పేముందని అన్నారు. గవర్నర్ ప్రసంగంపై ప్రతిపక్ష సభ్యులు సలహాలు ఇస్తారని ఆశించామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. కాంగ్రెస్ జాతీయ పార్టీ అని.. దిల్లీకి ఎన్నిసార్లయినా వెళ్తామని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం దిల్లీ వెళ్లి ప్రధాని, కేంద్రమంత్రులను కలుస్తున్నామన్నారు. ప్రాంతీయ పార్టీగా ఉన్నప్పటికీ బీఆర్ఎస్ నేతలు ఎన్నోసార్లు దిల్లీకి చక్కర్లు కొట్టారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వానికి కేటీఆర్ సలహాలు, సూచనలు ఇస్తారని అనుకున్నామని.. ఎవరో రాసిన స్క్రిప్ట్‌ను చదువుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఊకదంపుడు ఉపన్యాసం ఇస్తున్నారంటూ విమర్శించారు. ప్రధానమంత్రి దగ్గరకు కేటీఆర్ ఎన్నిసార్లు వెళ్లారో లెక్క తీయాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎన్నిసా÷-లంల్ల÷నా ఢిల్లీకి వెళతామని.. ప్రధానిని మంత్రులను కలుస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి బీఆర్ఎస్‌లా తాము ఢిల్లీకి వెళ్లడం లేదని అన్నారు. కేటీఆర్ సత్యదూరమైన మాటలు మాట్లాడుతున్నారన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో, పార్లమెంట్ ఎన్నికల్లో, మున్సిపల్ ఎన్నికల్లో ఎ÷-లాప్ అయింది బీఆర్ఎస్ అంటూ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. పవిత్ర రంజాన్ మాసం క్రమశిక్షణ, సహనం, సేవాభావం, మానవత్వానికి ప్రతీకమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ , తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన దావత్-ఏ-ఇఫ్తార్ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సమాజంలో అట్టడుగు వర్గాల గొంతుకగా నిలిచే జర్నలిస్టులు కులమతాలకు అతీతంగా ఇఫ్తార్ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వారు వారధిలా పనిచేస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్ విషయంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, అక్రిడిటేషన్ కమిటీలో జర్నలిస్టుల సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. అలాగే ఇళ్ల స్థలాల కేటాయింపు, హెల్త్ కార్డుల మంజూరు వంటి అంశాల్లో కూడా సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అక్రిడిటేషన్ కార్డుల జారీలో కానీ అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటులో కానీ జర్నలిస్టుల అందరి సలహాలు సూచనలు తీసుకొని ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, సుల్తాన్ ఉల్ ఉలూమ్ విద్యాసంస్థల సెక్రటరీ జఫర్ జావేద్, పిస్తా హౌస్ సీఈఓ ఎం.ఏ. మజీద్, టీయూడబ్ల్యూజే అధ్యక్షులు కె. విరాహత్‌అలీ, ప్రధాన కార్యదర్శి కె. రామనారాయణ, టీయూడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షులు ఎం.ఏ. మజీద్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ మొహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశ్నోత్తరాలు లేకుండా అసెంబ్లీ సమావేశాలు

తీర్మానంపై చర్చలో భాగంగా ప్రభుత్వ సమాధానం ఇస్తుంది. మార్చి 19న ఉగాది సందర్భంగా అసెంబ్లీకి సెలవు. మార్చి 20న తెలంగాణ బడ్జెట్‌ను ఉభయ సభలలో ప్రవేశపెడతారు. మార్చి 21న రంజాన్, 22న ఆదివారం సందర్భంగా సెషన్‌కు విరామం ప్రకటించారు. మార్చి 23 నుంచి రాష్ట్ర బడ్జెట్‌పై ఉభయ సభలలో చర్చ జరుగుతుంది. మార్చి 26న శ్రీరామనవమి, 29న ఆదివారం నాడు విరామం ఇచ్చారు. మార్చి 30న ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చ జరిపిన తరువాత రాష్ట్ర బడ్జెట్‌ను అసెంబ్లీ ఆమోదిస్తుంది. ఈ సెషన్లో ఒకరోజు ఉభయసభల్లోనూ మూసీ పునరుజ్జీవంపై ప్రభుత్వ నిర్ణయాలు, ప్రతిపక్షాల ప్రశ్నలు లేవనెత్తుతూ చర్చ జరగనుంది. రాష్ట్ర బడ్జెట్‌పై చర్చలకు ఈ సమయం సరిపోదని, మరికొన్ని రోజులు సభ నిర్వహించాలని బీఆర్ఎస్ కోరింది. ఆదివారాలు అయినప్పటికీ మార్చి 22, 29 తేదీల్లో సభను నిర్వహించాలని, అదే విధంగా మార్చి 31 వరకు సమావేశాలను కొనసాగించాలని బీఆర్ఎస్ నేతలు కోరారు.

## డ్రగ్స్ టెస్టులకు రేవంత్ రెడ్డి సిద్ధం

ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ బీఆర్ఎస్ నేతలకు బహిరంగ సవాల్ విసిరారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులంతా డ్రగ్ టెస్టుకు సిద్ధంగా ఉన్నారని ఆయన ప్రకటించారు. తొలి డ్రగ్స్ టెస్ట్ సీఎం రేవంత్ రెడ్డి చేయించుకుంటారని మహేష్ గౌడ్ అన్నారు. 'తెలంగాణ ప్రజలకు ప్రజాప్రతినిధులు ఆదర్శంగా నిలవాలి. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని డ్రగ్స్, గంజాయిపరం చేసిన ఘనులు బీఆర్ఎస్ నేతలు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందుకోసం స్పెషల్ టీమ్స్ ఏర్పాటు చేసింది. డ్రగ్స్ కు మేం వ్యతిరేకంగా అని చెప్పేందుకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి డ్రగ్ టెస్ట్ చేయించుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులంతా కూడా డ్రగ్స్ పరీక్షలకు వస్తారు. మరి బీఆర్ఎస్ నేతలు డ్రగ్స్ టెస్టుకు సిద్ధమా?. బీఆర్ఎస్ సభ్యులు తమ నాయకులైన ప్రతిపక్షనేత కేసీఆర్, కేటీఆర్‌లను కూడా డ్రగ్ టెస్టుకు తీసుకురాగలరా' అని మహేష్ కుమార్ గౌడ్ ఛాలెంజ్ చేశారు. డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం తాము చిత్తశుద్ధితో పని చేస్తున్నామని, తప్పు చేయని వారు భయపడాల్సిన అవసరం లేదని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. మొయినాబాద్ డ్రగ్స్ కేసును అడ్డుపెట్టుకుని రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారన్న బీఆర్ఎస్ ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. నేరస్తులు ఎవరైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు. ఈ సవాళ్లు, ప్రతిసవాళ్లతో శాసనమండలి దద్దరిల్లింది. రాజకీయ నేతల మధ్య మొదలైన ఈ 'డ్రగ్ టెస్ట్' వార్ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇంతకీ డ్రగ్స్ టెస్టుకు ఎవరు వస్తారో, ఎవరు డుమ్మా కొడతారని తెలంగాణ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

### మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డిపై

## కేసీఆర్ సీరియస్

వచ్చాయి. అదే విధంగా పోలీస్ కేసు నమోదు అయిన నేపథ్యంలో క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి నోటీసులు జారీ చేసినట్లు బీఆర్ఎస్ నోటీసుల్లో పేర్కొంది.ద'మొయినాబాద్ ఫాం హౌస్‌లో జరిగిన ఘటనపై పలు మీడియా నివేదికలు మరియు ఇతర విశ్వసనీయ సమాచారం ద్వారా హైదరాబాద్ పరిసర ప్రాంతంలో జరిగిన ఒక సమావేశంలో మీరు హాజరై ఉండగా అక్కడ మాదక ద్రవ్యాలు వినియోగించబడ్డాయని ఆరోపణలు వెలువడిన విషయం పార్టీ ఉన్నత న్యాయకత్వం దృష్టికి వచ్చింది. ఈ వార్తలు విస్తృతంగా మీడియాలో ప్రసారం కావడంతో పాటు పార్టీకి మరియు ప్రజల్లో కూడా తీవ్ర ఆందోళన కలిగించాయి'అని బీఆర్ఎస్ నోటీసుల్లో పేర్కొంది.'బీఆర్ఎస్ పార్టీ ఒక బాధ్యతాయుతమైన రాజకీయ సంస్థగా చట్టపరమైన నిబంధనలు, నైతిక విలువలు పాటించడంలో విశ్వాసం కలిగి ఉంది. అక్రమ కార్యకలాపాలు, ముఖ్యంగా మాదకద్రవ్యాల లేదా మత్తు పదార్థాల వినియోగం లేదా వాటిత ఏ విధమైన సంబంధం కలిగి ఉండటాన్ని పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుంది' అని బీఆర్ఎస్ నోటీసుల్లో తెలిపింది. 'పై సంఘటనలో మీ హాజరు మరియు ప్రమేయం ఉందనే ఆరోపణలు పార్టీకి తీవ్రమైన అపకీర్తిని తెచ్చిపెట్టడమే కాకుండా పార్టీ ప్రతిష్ట మరియు విశ్వసనీయతకు భంగం కలిగించే అవకాశం కలిగించాయి. పై విషయాలను దృష్టిలో ఉంచుకుని పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశం మేరకు, ఈ నోటీసు అందిన తేదీ నుంచి 7 రోజులలోపు మీడియా ద్వారా వచ్చిన ఆరోపణలపై మీ జవాబు స్పష్టంగా వివరిస్తూ సమగ్రంగా లిఖితపూర్వక వివరణ సమర్పించవలసిందిగా మిమ్మల్ని ఈ నోటీసు ద్వారా ఆదేశిస్తున్నాం'అని బీఆర్ఎస్ వెల్లడించింది.'ఈ విషయంపై పార్టీ నాయకత్వం సమగ్రంగా పరిశీలించి తుది నిర్ణయం తీసుకునే వరకు మీరు పార్టీ కార్యక్రమాలు మరియు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనకుండా ఉండవలసిందిగా ఆదేశిస్తున్నాం అని లేఖలో పేర్కొంది.ఈ నోటీస్ గడువులోపు సంతృప్తికరమైన వివరణ సమర్పించడంలో విఫలమైతే పార్టీ రాజ్యాంగం మరియు నియమావళి ప్రకారం మీపై తగిన క్రమశిక్షణాత్మక చర్యలు ఎటువంటి అదనపు నోటీసు లేకుండానే తీసుకోబడతాయని గమనించగలరు'అని బీఆర్ఎస్ నోటీసుల్లో పేర్కొంది.

## ప్రజాపోరాటాలు తప్పక విజయం సాధిస్తాయి

కూల్చేసిన వారిలో 411 మందికి పట్టాలు ఇస్తామని ప్రకటించింది, ప్రజా పోరాటాలు తప్పక విజయం సాధిస్తాయనే విషయం నిరూపితమైంది. 750 మంది ఇండ్లు కూల్చివేసి కేవలం 411 మందికి మాత్రమే పట్టాలు ఇవ్వడంతో మిగతా బాధితుల్లో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. తమకు అన్యాయం జరిగిందనే భావన వారిలో నెలకొన్నది. పట్టాల పంపిణీలో పారదర్శకత ఉండాలని, ప్రతి బాధితుడికి న్యాయం జరగాలనే లక్ష్యంగా వెలుగుమట్ల బాధితుల కోసం నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేశాము. రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలోని నిజ నిర్ధారణ కమిటీలో ఆర్మీ మాజీ అధికారి, ప్రొఫెసర్లు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టులు భాగస్వాములు కావడం సంతోషంగా ఉంది. బాధితులకు న్యాయం జరిగే వరకు ఈ కమిటీ ప్రభుత్వం వెంటబడుతుంది. నిజ నిర్ధారణ కమిటీకి ప్రభుత్వం, ప్రభుత్వాధికారులు సంపూర్ణంగా సహకరించాలని డిమాండ్ చేస్తున్నా' అని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు.

### మేం చేస్తున్న పనులకు ధన్యవాదాలు చెప్పాలి: కోమటిరెడ్డి

**హైదరాబాద్,:** కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు చెప్పాలని అన్నారు. 'రేషన్ కార్డు ఇచ్చినందుకు ధన్యవాదాలు చెప్పాలి. యంగ్ ఇండియా స్కూల్ కట్టినందుకు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ఇచ్చినందుకు, ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చినందుకు ధన్యవాదాలు చెప్పాలని అన్నారు. కేటీఆర్ ఓపికగా ఉండాలని మంత్రి హితవుపలికారు. ఈ ప్రభుత్వం పేదల కోసమే ఉందని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షల కోట్లు అప్పు చేసిందని.. వాటికి తాము వడ్డీ కడుతున్నామని.. అందుకు ధన్యవాదాలు చెప్పాలంటూ కేటీఆర్‌కు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ధీటైన జవాబిచ్చారు.

## ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు

# వెంటనే విడుదల చేయాలి

**- సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు**



**కల్వకుర్తి మార్చి 17 (అక్షర గళం)** ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు రావలసిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చింత ఆంజనేయులు డిమాండ్ చేశారు. కల్వకుర్తి మండలంలోని వివిధ గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ పని ప్రదేశాలను మంగళవారం సందర్శించారు. ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను నమోదు చేసుకున్నారు. ఈ కార్య క్రమంలో సీపీఎం జిల్లా నాయకులు బి అంజనేయులు తదితరులున్నారు.

## డ్రగ్స్ రహిత లక్ష్యంతో..

# కేటీసీపీఎల్ సెమీ ఫైనల్ ప్రారంభం!



కల్వకుర్తి మార్చి 17 (అక్షర గళం) డ్రగ్స్ రహిత కల్వకుర్తి లక్ష్యంతో నిర్వహిస్తున్న ఖుజ్రూ క్రికెట్ టోర్నమెంట్ సెమీ ఫైనల్ మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. మానవత, లయన్స్ క్లబ్, మిత్ర, వందేమాతరం వంటి పలు సేవా సంస్థల సహకారంతో ఈ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. క్రీడల ద్వారా యువతలో అవగాహన కల్పిస్తూ పట్టణాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చడమే ఈ టోర్నీ ప్రధాన ఉద్దేశం అని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# పారిశుధ్య కార్మికుల సేవలు గొప్పవి



**కల్వకుర్తి మార్చ్ 17 (అక్షర గళం)** కార్మికుల సేవలు గొప్పవని సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు మంగళవారం పాలన-ప్రగతి ప్రణాళిక లో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. సందర్భంగా కార్మికులకు శానిటైజర్ మాస్క్ హ్యాండ్ వాష్ సూప్స్ అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో లింగరావుపల్లి సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి డిప్యూటీ సర్పంచ్ బూత్కూరి వెంకటరెడ్డి, పంచాయతీ సెక్రటరీ విష్ణువర్ధన్ రెడ్డి గారు వార్డు మెంబర్ బొచ్చుపల్లి లక్ష్మీదేవి మల్లెమొగ్గల శ్రీజ టేకురి శివలింగం కుంబర్తి రమ్య రాజమౌని భాగ్య టేకురి సుమన్ చింతలపల్లి సురేందర్ రెడ్డి బండగళ్ళ జంగయ్య బోచుపల్లి శేఖర్ రబ్బానీ గ్రామ సిబ్బంది జంగయ్య లక్ష్మమ్మ రాములమ్మ చేన్నమ్మ శ్రీరాములు మల్లేష్ పున్నమ్మ చెన్నమ్మ వెంకటయ్య సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## లింగరావుపల్లి గ్రామపంచాయతీకి వరాల జల్లు

## గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి



**కల్వకుర్తి మార్చ్ 17 (అక్షర గళం)** లింగరావుపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామపంచాయతీగా మారుస్తానని గ్రామ సర్పంచి కాసు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం తలకొండపల్లి మండలం పరిధిలో లింగరావుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా లోనే మొదటి స్థానంలో లింగారావుపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాను అని పెండింగ్ లో ఉన్న జజ మరియు డ్రైన్ పనులు పూర్తి చేసి స్వచ్ఛ ధనం-పచ్చధనం గా ఊరిని మారుస్తా అని గ్రామస్థులు తనకి సహకరించాలి అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుత్కూరి వెంకటరెడ్డి, పంచాయతీ సెక్రెటరీ విష్ణువర్ధన్ రెడ్డి,లయన్స్ క్లబ్ మెంబర్ అంజి రెడ్డి, ఆమనగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోతిరెడ్డి శ్యాంసుందర్ రెడ్డి, వార్డు సభ్యులు టేకురీ శివలింగం సురేందర్ రెడ్డి టెకూరి సుమన్ బండ గళ్ళ జంగయ్య బొచ్చుపల్లి శేఖర్, రాజమౌనీ భాగ్య కుంబర్తి రమ్య మల్లెమొగ్గల శ్రీజ బొచ్చుపల్లి లక్ష్మీదేవి తలకొండపల్లి కరెంటు ాజు విజయ్, ఊూా శంకరయ్య, మాజీ సర్పంచులు ఎల్లమ్మ తిరుపతయ్య, జినుకుంట్ల శ్రీనివాస్ గౌడ్,దీూా మల్లమ్మ పద్మమ్మ ఖీూా మెలిగరీ రాములు ఋూా ఇమిడి సాత్విక అంగన్వాడి టీచర్ భారతి లైన్మెన్ శేఖర్ గ్రామస్తులు గ్రామపంచాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తెలుగు దినపత్రిక https://aksharagalam.com
అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం

# తెలంగాణ రౌండప్

**బుధవారం - 18 మార్చి 2026 - పేజీలు**

## అంబేద్కర్, పూలేల ఆశయల సాధనే

# వారికి మనమిచ్చే ఘన నివాళులు

- యువత అంబేద్కర్ సూచనలతో ముందుకు పోవాలి
- మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలి
- సమసమాజ నిర్మాణం కోసం పోరాడాలి
- జ్ఞాన మాల కార్యక్రమంలో గుజ్జుక పరుశురాం



**కీసర, మార్చి 17,(అక్షర గళం) :** భారత రాజ్యాంగ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, వారు చూపిన మార్గంలో మనందరం నడవడమే వారికి మనం ఇచ్చే గొప్ప నివాళి అని జాతీయ మాల మహానాడు సంఘం మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కన్వీనర్ గుజ్జుక పరుశురాం అన్నారు. ఆదివారం నాడు దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోనీ రాజీవ్ గృహకల్ప కాలనీ లో మాల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బాబాసాహెబ్ అంబేద్కర్, మహాత్మా



జ్యోతిరావు పూలే గార్ల కు నిర్వహించిన 210వ జ్ఞాన మాల కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరయ్యి మహనీయుల విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గుజ్జుక పరుశురాం మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ రూపకర్తగానే కాక ఆయన గురువు అయిన మహాత్మా జ్యోతిరావు పూలే గారు కలలు కన్న ఆశయలను సమాజంలో సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ స్థాపన కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఆయన కలలు కన్న భారత దేశాన్ని నిర్మించడానికి యువత ముందుకు రావాలి. విద్య, సామాజిక న్యాయం, చైతన్యం, హక్కుల పరిరక్షణ---ఇవి అంబేద్కర్ చూపిన మార్గాలు. వాటిని ఆచరణలో పెట్టినప్పుడే మనం మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకపోయిన వాళ్ళం అవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో అర్జికే మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు యాటా రాజు, సలహాదారులు అబ్బులు, రాజేంద్ర ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొలాటి రాజు, కోశాధికారి చెన్నయ్య, మాల సంఘం సభ్యులు రాధాక్రిష్ణ , వినాయక రావు, బ్యాగరి సంజీవ రావు, వెంకటేశ్వర రావు, శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఐసీసీ తెలంగాణ సమన్వయ

# కమిటీలో చల్లాకు చోటు



కల్వకుర్తి మార్చి 17 (అక్షర గళం)తెలంగాణలో పార్టీ, ప్రభుత్వ వ్యవహారాల మధ్య సమన్వయం కోసం ఏఐసీసీ 8 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్ రెడ్డికి స్థానం కల్పించారు. పార్టీ సంస్థాగత బలోపేతం లక్ష్యంగా కాంగ్రెస్ హైకమాండ్ ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర రాజకీయాల్లో ఈ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది.

## పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న

# కాంగ్రెస్ నాయకులు బాలాజీ సింగ్



కల్వకుర్తి మార్చి 17(అక్షర గళం) కల్వకుర్తి మండల పరిధిలోని తర్నికల్ గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్ అరవింద్ గౌడ్ కుమారుని పుట్టినరోజు వేడుకకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ రాష్ట్ర నాయకులు బాలాసింగ్ హాజరు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# మార్చాలాలో విషాద ఛాయలు

**- శ్రీశైలం -- హైదరాబాద్ జాతీయ రహదారిపై కారు బొలెరో వాహనం డి ఒకరు మృతి**







**కల్వకుర్తి మార్చ్ 17 (అక్షర గళం):** శ్రీశైలం - హైదరాబాద్ జాతీయ ప్రధాన రహదారిపై కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని వెల్దండ మండలం రాగాయిపల్లి గేట్ సమీపంలో మంగళవారం జరిగిన కారు బొలెరో వాహనం ఢీ కొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికి చెందిన విశ్వహిందూ పరిషత్ నాగర్ కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షుడు గిరిధర్ రెడ్డి మృతి చెందాడు మార్చాల గ్రామానికి చెందిన గిరిధర్ రెడ్డి కల్వకుర్తి నుండి కారులో హైదరాబాదు వెళ్తున్న క్రమంలో రాగాయిపల్లి గేట్ సమీపంలో బొలెరో వాహనాన్ని గుండెపోటు రావడంతో ఈ ఘటన జరిగి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి అక్కడికక్కడే మృతి చెందిన గిరిధర్ రెడ్డిని పోస్ట్ మటర్ నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం సొంత గ్రామమైన మార్చాల గ్రామానికి తరలించారు. గిరిధర్ రెడ్డి వార్త కల్వకుర్తి పట్టణంలో దుఃఖ సాగరాన్ని మిగిలించింది. రోడ్డు ప్రమాదంలో మృతి చెందానన్న విషయాన్ని దహనంల వ్యాపించడంతో ప్రభుత్వ బిజెపి విశ్వహిందూ పరిషత్ ఆయా పార్టీల రాజకీయ నాయకులు ప్రభుత్వ ఆసుపత్రికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి కుటుంబాన్ని పరామర్శించారు. గిరిధర్ రెడ్డి కల్వకుర్తిలో నివాసం ఉంటున్నారు. హిందూ వారిగా గిరిధర్ రెడ్డి కి మంచి పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. గిరిధర్ రెడ్డి అకారం మరణం పట్ల దుఃఖ సాగరంలో మునిగిపోయారు.

# వైశ్య జాతి అంటేనే సేవా రంగంలో ముందుండేవాళ్లు

- అంబలి చలివేంద్రాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి
- బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మిషన్ భగీరథ మాజీ చైర్మన్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్
- ప్రయాణికుల కోసమే సౌకర్యం - ఆమనగల్ కౌన్సిలర్ పాపిశెట్టి రాము







**కల్వకుర్తి మార్చ్ 17 (అక్షరగళం):** వేసవి నేపథ్యంలో ప్రయాణికులను బాటసారులను పడు పేదవాడి కోసం అంబలి చలివేంద్రాన్ని మండల ఆర్యవైశ్య మహాసభ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రయాణికులకు ఎంతో మేలు చేకూరుతుందని ప్రయాణికుల కష్టాలను బాధలను తీర్చిన వాళ్ళము అవుతామని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ అన్నారు సోమవారం కల్వకుర్తి ఆర్టీసీ బస్టాండ్ లో పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆమనగల్ మున్సిపల్ కాంటెస్టెంట్ బి ఆర్ ఎస్ మున్సిపల్ చైర్మన్ కౌన్సిలర్ పాపిశెట్టి రాము మండల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు గంధం కిరణ్ ప్రసాద్ దాచేపల్లి శ్రీనివాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు . అనంతరం మాట్లాడుతూ వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకొని పేదవారికి సేవలు చేయడానికి వచ్చే రెండు మూడు నెలలలో పేద విద్యార్థులకు అభాగ్యులకు సమయానికి తిండి లేని వాళ్లకు అంబలి కేంద్రం ఆసరా నిలుస్తుందని అన్నారు. ఆర్యవైశ్యులు తమ వ్యాపారాలలో సంపాదించిన దానిలో సేవా భావంతో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని అన్నారు. అంబలి కేంద్రాన్ని చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పదిమంది ఆర్యవైశ్యులకు సహాయ సహకారాలను అందిస్తానన్నారు. ఈ సందర్భంగా పాపిశెట్టి రాము మాట్లాడుతూ ప్రపంచంలో యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో గ్యాస్ తోరత ఇండ్లలో వంటలకు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో అదేవిధంగా సిలిండర్ల పోరాట కారణంగా చాలా హోటల్లు మూతపడ్డాయని ఈ పరిస్థితులలో విద్యార్థులకు ప్రయాణికులకు కొంత ఉపశమనం లభిస్తుందని అంబలి కేంద్రం ద్వారా ఎంతమంది వృద్ధులకు ఆసరా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాము గంప వెంకటేష్ గంధం ప్రసాద్ దాచేపల్లి శ్రీనివాసులు సూర్యప్రకాష్ రావు భావనల మధు మనోహర్ రెడ్డి దారముని గణేష్ పూరి రమేష్ సుశీల ఈశ్వరయ్య వెంకటయ్య వెంకటేష్ పూల నరేష్ శివ నరసింహ శ్రీనివాసులు వివిధ గ్రామాల సర్పంచులు ఉప సర్పంచ్లు కల్వకుర్తి మున్సిపల్ కౌన్సిలర్లు తాజా మాజీ ప్రజా ప్రతినిధులు




వార్డు సభ్యులు బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పదాల్లో పరమార్థం అన్నమయ్యలో అపూర్వ వైచిత్రి :



**డా. శిరీష** శ్రీ తాళ్లపాక అన్నమయ్య సంకీర్తనల్లో ఉన్న భావ వైవిధ్యం అపూర్వమని ఎస్వీ యూనివర్సిటీ సంస్కృత విభాగ ఆచార్యులు డా. శిరీష తెలిపారు. భక్తి, శృంగారంతో పాటు నైతిక విలువలను అన్నమయ్య ఎంతో మధురంగా వ్యక్తం చేశారని చెప్పారు. తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో జరుగుతున్న శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల 523వ వర్ధంతి ఉత్సవాలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా "అన్నమయ్య సంకీర్తనలు - భక్తి, శృంగార నైతిక విలువల సమన్వయం" అనే అంశంపై మాట్లాడిన డా. శిరీష, అన్నమయ్య కీర్తనలలో భక్తి మాత్రమే కాకుండా శృంగార సౌందర్యం, మానవీయ విలువలను కూడా ప్రతిబింబిస్తాయని తెలిపారు. ఆయన పదాల్లో ఆధ్యాత్మికతతో పాటు జీవన సారాంశం దాగి ఉందని చెప్పారు. యువతలో భక్తి, నైతికత పెంపొందించడంలో అన్నమయ్య కీర్తనలు ముఖ్య పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కీర్తనలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి దేవస్థానం చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని తెలిపారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ఎస్వీ ప్రాచ్య పరిశోధనా సంస్థ విశ్రాంత ఆచార్యులు ఆచార్య గోవిందరాజు మాట్లాడుతూ, తాళ్లపాక అన్నమయ్యతో పాటు ఆయన వంశీకులు చేసిన సేవలు అమూల్యమని అన్నారు. వారి సాహిత్యం భక్తి, ఆధ్యాత్మికత, సంస్కృతిని కలిపిన గొప్ప సంపదగా నిలిచిందని తెలిపారు. ఈ సాహిత్యాన్ని "ఆంధ్ర వేదం"గా చెప్పవచ్చని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు ఈ సంపదను అందించడం అవసరమని సూచించారు. హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డా. విజయ్‌కుమార్ మాట్లాడుతూ, అన్నమయ్య సంకీర్తనలు భక్తి, శృంగార, ఆధ్యాత్మిక అంశాలతో నిండి ఉన్నాయని చెప్పారు. అన్నమయ్య సాహిత్యానికి ప్రత్యేకమైన శైలి ఉందని, అందులో ఆధ్యాత్మిక జ్ఞానం దాగి ఉందని తెలిపారు. శ్రీనివాసుడు ఎంత మహిమ గల దేవుడో, అన్నమయ్య అంతటి గొప్ప భక్తుడని అన్నారు.

# టీటీడీకి రూ.10 లక్షలు విరాళం



**తిరుమల,** గుంటూరుకు చెందిన శ్రీ వేంకటేశ్వర పౌల్ట్రీస్ సంస్థ అధినేత వేంకటేశ్వర రావు మంగళవారం టీటీడీ శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ. 10,01,116 విరాళంగా అందించారు. ఈ మేరకు దాత శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అదనపు ఈవో సి. హెచ్. వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు పాల్గొన్నారు.

## తిరువణ్ణామలైలో ఉచిత బస్సు సేవ ప్రారంభం

తిరువణ్ణామలై అన్నామలైయార్ ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో, 'గిరివలయం' (గిరి ప్రదక్షిణ) యాత్ర చేపట్టే భక్తుల సౌకర్యార్థం ఐదు ఉచిత బస్సు సేవలు ప్రారంభించబడ్డాయి. శాసనసభ ఉప సభాపతి కె. పిచ్చాండి, బస్సులను జెండా ఊపి ఈ సేవను లాంఛనంగా ప్రారంభించారు. ఈ బస్సులు ఉదయం 8:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు, రాజగోపురం, కేంద్ర బస్ స్టాండ్ మరియు యాత్రి నివాస్ సముదాయం నుండి నడుస్తాయని ఆలయ నిర్వహణ కమిటీ తెలిపింది.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం సురక్షితం

### - డాక్టర్ కె.కల్పన

**పత్తికొండ** ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం సురక్షితమని డాక్టర్ వైద్య అధికారి కల్పన అన్నారు. పత్తికొండ ప్రభుత్వ హాస్పటల్లో సరైన వైద్యం అందదు అనే ప్రచారం విమర్శలు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ హాస్పిటల్లోనే సాధారణ కాన్పులు ప్రసవించిన జరుగుతున్నాయి వివరాల్లోకెళ్తే పందికోన గ్రామానికి చెందిన చాకలి గాయత్రి (భర్త: చాకలి రాజేష్) తన మొదటి ప్రసవంలో 3.7 కిలోల బరువున్న ఆరోగ్యవంతమైన బాబు బిడ్డకు జన్మనిచ్చారు. ఈ ప్రసవాన్ని డా. కల్పన విజయవంతంగా సాధారణ (నార్మల్) డెలివరీగా నిర్వహించారు. ప్రస్తుతం తల్లి మరియు శిశువు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారు. గర్భిణులు ప్రతినెల వైద్యపరీక్షలు చేయించుకోవాలని ఆకుకూరలు, పండ్లు, పౌష్టికా హారాన్ని తీసుకోవాలన్నారుఅనంతరం రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించి హైరిస్క్ గర్భిణులను గుర్తించి సూచనలిచ్చారు. క్రమం తప్పకుండా ఐరన్ మాత్రలు వినియోగించాలని ప్రతినెల పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, గర్భిణీలు సమీప ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు.

## ఒంటిమిట్ట కోదండరాములవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లను పరిశీలించిన కడప జిల్లా ఎస్పీషెల్కే నచికేత్ విశ్వనాథ్

**బద్వేలు** కడప జిల్లా ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల నేపథ్యంలో హెలిప్యాడ్, పార్కింగ్, కల్యాణవేదిక వద్ద చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేసిన జిల్లా ఎస్.పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఈ నెల 26 నుండి ప్రారంభం కానున్న ఒంటిమిట్ట కోదండరాములవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్.పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఒంటిమిట్టలో పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కోదండ రామాలయం, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రదేశాలు, కల్యాణ వేదిక పరిసరాలను పరిశీలించి చేపట్టాల్సిన భద్రతా చర్యలపై రాజంపేట ఏ.ఎస్.పీ రామనాథ్ హెగ్డే కు పలు సూచనలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్ కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా వాహనాలు వెళ్లేలా ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పలువురు వి.ఐ.పీ లు ఉత్సవాలకు హాజరు కానున్న నేపథ్యంలో తగిన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్.పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశించారు. రాజంపేట ఏ.ఎస్.పీ రామనాథ్ హెగ్డే , ఒంటిమిట్ట సి.ఐ నరసింహ రాజు, సిబ్బంది పాల్గొన్నారు

# ఓ అండ్ ఎం పనులపై సమీక్ష

### - ఇరిగేషన్ అధికారులతో మంత్రి నిమ్మల వీడియో కాన్ఫరెన్స్



**అమరావతి** ఓ అండ్ ఎం పనుల పై ఇరిగేషన్ అధికారులతో, మంత్రి నిమ్మల రామానాయుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కడా కమిషనర్ ప్రశాంతి, ఇరిగేషన్ సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సిఈ లు, మరియు ఇతర ఉన్నతాధికారులు హజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ వందల,వేల కోట్లు పెట్టి ప్రాజెక్టులు నిర్మిస్తే, వైసిపి ప్రభుత్వం మెయింటెన్స్ కూడా లేకుండా గాలికొదిలేసింది. గత ప్రభుత్వంలో కనీసం కాలువల్లో తట్ట మట్టి తీయకపోగా, షట్టర్లు,డోర్లు, గేట్లకు మరమ్మత్తులు చేయకపోగా, గ్రీజు కూడా పెట్టలేదు. గత పాలకులు చేసిన తప్పిదాలను సరిచేసుకుంటూ, ఇరిగేషన్ రంగాన్ని గాడిలో పెడుతున్నామని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం 5 ఏళ్లలో నిర్వహణా నిమిత్తం 200 కోట్లు కూడా ఖర్చు చేయకపోతే, కూటమి ప్రభుత్వం మొదటి రెండేళ్ళలోనే 878 కోట్లు మంజూరు చేసి ఖర్చుచేయడమైనది. 2026 ఖరీఫ్ ప్రారంభానికి ముందే నీటిపారుదల వ్యవస్థలను సాధారణ స్థితికి తీసుకురావడమే లక్ష్యంగా ఓఅండ్ఎం పనులు చేపట్టాలి. గతంలో మాదిరిగా కాకుండా మే 15 నాటికి, అన్ని అత్యవసర పనులు, నాణ్యత తో పూర్తి చేయాలి. రైతుల అవసరాల కోసం చెరువుల్లో పూడిక తీసిన మట్టిని, క్యూబిక్ మీటర్ 1 రూపాయికే, రైతులకు సరఫరా చేసేలా అనుమతులు కూడా ఇచ్చామని అన్నారు.

## మల్లారెడ్డి క్రికెట్ ట్రోఫీలో ఫైనల్‌కు

# చేరుకున్న కుత్బుల్లాపూర్ జట్టు




అక్షర గళం , కుత్బుల్లాపూర్ : మల్లారెడ్డి క్రికెట్ ట్రోఫీ పోటీలలో కుత్బుల్లాపూర్ జట్టు అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు చేరుకుంది. జరిగిన మ్యాచ్‌లో కుత్బుల్లాపూర్ జట్టు అన్ని విభాగాల్లోనూ మెరుగైన ఆటతీరును ప్రదర్శించి ప్రత్యర్థి జట్టుపై ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన కుత్బుల్లాపూర్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 128 పరుగులు చేసింది. జట్టు ఆటగాళ్లు సమష్టిగా రాణిస్తూ జట్టుకు పోటీకి సరిపడే స్కోర్ అందించారు. 128 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన మల్కాజ్గిరి జట్టు కుత్బుల్లాపూర్ బౌలర్ల దాటికి తట్టుకోలేకపోయింది. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో కుత్బుల్లాపూర్ జట్టు మల్కాజ్గిరి జట్టును కేవలం 64 పరుగులకే ఆలౌట్ చేసింది. దీంతో కుత్బుల్లాపూర్ జట్టు భారీ తేడాతో విజయం సాధించి ఫైనల్‌కు అర్హత సాధించింది. ఈ మ్యాచ్‌లో కుత్బుల్లాపూర్ జట్టు అత్యధిక పరుగులు సాధించి ప్రత్యేక గుర్తింపు పొందింది. జట్టు ఆటగాళ్ల ప్రదర్శనపై అభిమానులు, స్థానిక క్రీడాభిమానులు అభినందనలు తెలిపారు.

## గాజులరామారం సర్కిల్ పరిధిలో సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ విస్తృత పర్యటన




అక్షర గళం, కుత్బుల్లాపూర్: గాజులరామారం సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి.సృజన మంగళవారం విస్తృత్తంగా పర్యటించారు.. ఈ సందర్భంగా కమిషనర్ సి.ఎం.సి, లాల్సాబ్‌గూడ మెయిన్ రోడ్ వద్ద జరుగుతున్న నిర్మాణ స్థలాన్ని ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధిలోకి వస్తుందా అని నిర్ధారించుకోవడానికి తనిఖీ చేశారు.

బంధం చెరువు వద్ద ఎఫ్టీఎల్ వద్ద సరిహద్దులను గుర్తించాల్సిందిగా సంబంధిత శాఖలు నీటిపారుదల, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ శాఖలకు ఆదేశించారు. ఆ స్థలం ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధిలోకి వస్తుందా అనే విషయాన్ని నిర్ధారించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. తదుపరి చర్యలకు ముందు అన్ని సంబంధిత పత్రాలను పూర్తిగా పరిశీలించాలని కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గాజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీపాద రామేశ్వర్, సీసీపీ వెంకన్న, అడిషనల్ సీసీపీ శైలజ, ఏసిపి సుమిత్ర,డిప్యూటి ఈఈ ఎస్డబ్ల్యు ఎం నిఖిల్ రెడ్డి, డిప్యూటిఈఈ అనురాగ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# జోరుగా ఇసుక రవాణా.

- అధికార పార్టీ నాయకులే సూత్రధారులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు.
- మన ఇసుక, మన ట్రాక్టర్, మన ప్రభుత్వం
- ఒక్కో ట్రాక్టర్ కు రోజుకు 1200 చొప్పున ఒప్పందం.



**సి.బెళగల్** మండలంలో ఇసుక దందాకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. అధికార పార్టీ నాయకుల అండదండలతో ఇసుకా సురులు రెచ్చిపోతున్నారు. మండలంలోని తిమ్మం దొడ్డి గ్రామంలో గల తుంగభద్ర నది నుంచి ఇసుక దోపిడి జోరుగా సాగుతుంది. రాత్రి పగలు తేడా లేకుండా తుంగభద్ర నది నుంచి తవ్వకాలు చేపడుతూ ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. రోజుకు 180 నుండి 200 ట్రిప్పుల ఇసుక ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్నారు. గత వారం రోజుల నుండి యచ్చెదగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నాఅధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం. రాత్రి పగలు రోడ్డుపై ఇసుక ట్రాక్టర్లు రయ్ రయ్ మంటూ వెళు న్న పట్టించుకోకపోవడం పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యంగా గతంలో మాదిరిగా అధికార పార్టీ నాయకులే ఇసుక దోపిడీకి సూత్రధారులుగా ఉన్నట్లు సమాచారం. మండలంలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టాల్సిన అధికారుల సైతం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇందుకు ముఖ్య కారణం ప్రభుత్వం ఏర్పాటుచేసిన సింగవరం, ఈర్లదిన్నె, ముడుమాల గ్రామాలలో ఇసుకరిచ్చులలో ఇసుక నిల్వ లేకపోవడంతో అక్రమ ఇసుక రవాణా దారులకు భలే గిరాకీపెరిగింది. ఇదే అదనుగా భావించిన అధికార పార్టీకి చెందిన నాయకులే రోజుకు ఒక్కో ట్రాక్టర్ కు 1200 రూపాయలు ప్రకారం ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. అక్రమంగా తరలిస్తున్న ఇసుకను ట్రాక్టర్ కు 3000 నుండి 4000 రూపాయలు వరకు ప్రజల నుండి వసూలు చేస్తున్నట్టు సమాచారం.

**మన ఇసుక, మన ట్రాక్టర్, మన ప్రభుత్వం** ఇసుక అవసరం ఉన్న వ్యక్తులు ఇసుకరించల వద్ద ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ ఇసుక రవాణా ఏర్పాటు చేసింది. ఈ విధంగా దరఖాస్తు చేసుకున్న ట్రాక్టర్లకు ఇసుకరించల వద్ద ఇసుక ఉచితంగా అందించడం జరుగుతుందని కూటమి ప్రభుత్వం చెబుతుంది. కానీ మండలంలోని చోటామోటా నాయకులు మాత్రం ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరూ చేస్తూ తుంగభద్ర నది మనదే, ట్రాక్టర్ మనదే, ప్రభుత్వం మనదే, ఇసుకా మనదే ఇసుక రవాణాను అడ్డగించేది ఎవరు అన్న రీతిలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తూ అందిన కాటికి దోచుకుంటున్నారు. ఇప్పటికైనా అక్రమ ఇసుక రవాణాను అరికట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇసుకను అందించాలని ప్రభుత్వ అధికారులను ప్రజలు కోరుతున్నారు. ఇసుక తరలింపు పై తహసిల్దారు వెంకటలక్ష్మివివరణ ----తుంగభద్ర నది నుంచి రాత్రి వేళలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని విషయంపై ఉదయం న్యూస్ రిపోర్టర్ మండల తహసిల్దార్ వెంకటలక్ష్మిని చరవాణి ద్వారా వివరణ కోరగా ఇసుకకు సంబంధించి మండలంలో ఎవరికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. అలాగే గ్రామాలలో ఎవరికైనా ఇసుక అవసరం అనుకుంటే వారి వారి అవసరాల నిమిత్తం గ్రామ కార్యదర్శి లేదా ఏపీ సాండ్ పోర్టల్ అనుమతులు తీసుకొని ఇసుక వాడుకోవాలన్నారు. అంతేగాని అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుకను అక్రమంగా వ్యాపారం కోసం తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె (వెంకటలక్ష్మి) స్పష్టం చేశారు.

# మినీ బస్సు బోల్తా..
# ప్రయాణికులకు గాయాలు

**హైదరాబాద్** మియాపూర్లో ప్రైవేట్ మినీ బస్సు బోల్తా పడింది. కూకట్పల్లి నుండి గడ్డపోతారం వెళ్తుండగా ప్రమాదం జరిగింది. లీ ఫార్మా కంపెనీకి చెందిన బస్సుగా గుర్తించారు. బాచుపల్లి సమీపంలో మలుపు వద్ద బస్సు నియంత్రణ కోల్పోయింది. బస్సులోని పది మంది ఉద్యోగులకు గాయాలు అయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా వుంది. గాయపడినవారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

## ఆచంట వేమవరంలో మట్టి మాఫియా గుట్టురట్టు!

ఆచంట జిల్లాలోని ఆచంట వేమవరంలో మట్టి మాఫియా సాగిస్తున్న అక్రమ దందాకు అధికారులు హుకుం జారీ చేసినప్పటికీ వెనక్కి తగ్గని మట్టి మాఫియా గత వారం రోజులుగా నక్కల కాలువ నుండి యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్న వైనంపై రైతులు ఫిర్యాదు చేయడంతో ఇరిగేషన్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఇక్కడ మట్టి తవ్వడానికి ఎటువంటి పర్మిషన్లు లేవని అధికారి తేల్చి చెప్పారు. అయినప్పటికీ బరితెగించిన మాఫియా: వారం రోజులుగా పగలు, రాత్రి తేడా లేకుండా మట్టి తవ్వకాలు జరుపుతూ అక్రమంగా తరలిస్తున్నారు రైతుల ఆందోళనతో రంగంలోకి దిగిన ఇరిగేషన్ అధికారులు, తవ్వకాలను పరిశీలించి ఆరు లారీలు, రెండు జేసీబీలను సీజ్ చేసామని చెప్పారు. అక్కడ నుంచి బయటికి వెళ్లిన మరుక్షణం మళ్లీ మట్టితోలకాల ప్రారంభించింది మాఫియా.

## ఏసిబి వలలో మున్సిపల్ సర్వేయర్



**తాడేపల్లిగూడెం** లంచం తీసుకుంటూ మున్సిపల్ సర్వేయర్ ఏసీబీకి చిక్కాడు. ఈ నేపథ్యంలో × తాడేపల్లిగూడెం మున్సిపల్ సర్వేయర్ రౌతు రామకృష్ణ నివాసంలో ఏసీబీ తనిఖీలు జరిపింది. స్థలం సర్వే రిపోర్టుకు యజమాని వద్ద సర్వేయర్ రామకృష్ణ రూ.50 వేలు నగదు తీసుకుంటుండగా పట్టుకున్నారు. సర్వేయర్, సర్వే సిబ్బంది, కుటుంబ సభ్యులను విచారిస్తున్ఆనరు. మున్సిపల్ సర్వేయర్, ఇన్చార్జ్ డివిజనల్ సర్వేయర్గా పనిచేస్తున్న రామకృష్ణపై ఇప్పటికే పలు అవినీతి ఆరోపణలు వచ్చినట్లు సమాచారం.

# అసెంబ్లీలో బీజేపీ నిరసన




**హైదరాబాద్** రైతన్నల ఉసురు పోసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించాలని చేపట్టిన బిజెపి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర పార్టీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు మరియు బిజెపి నాయకులు డిమాండ్ చేసారుఉ. ఈమేరకు తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో నిరసనకు దిగారు. రైతులకు సంపూర్ణ రుణమాఫీ అమలు చేయాలి. ఆగిన రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలి. రాష్ట్రంలో పీఎం ఫసల్ బీమా యోజన అమలు చేసి తీరాలని అన్నారు.. అన్నదాతల కన్నీరు తుడిచేదాకా, వారికి దక్కాల్సిన హక్కులు సాధించేదాకా ఈ పోరాటం ఆగదని అన్నారు....

## పోలీస్ వాహనాన్ని నడిపి.. సైకో వీరంగం



**చిత్తూరు** గంగవరం మండల కేంద్రంలో ఓ సైకో వీరంగం సృష్టించాడు. కర్ణాటకకు చెందిన రత్నాకర్ తన భార్యతో గొడవపడి దండపల్లి క్రాస్ వద్ద నిలిపి ఉంచిన పోలీస్ వాహనంలో దూరాడు. అనంతరం ఇష్టానుసారంగా నడిపి ఓ ఆటోను ఢీకొనడంతో డ్రైవర్ రెండు కాళ్లు విరిగిపోయాయి. తరువాత మరో కారును ఢీకొనడంతో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. అనంతరం వాహనాన్ని వదిలేసి పరుగులు తీసే క్రమంలో చెరువులో పడ్డాడు. దీంతో అగ్నిమాపక సిబ్బంది పట్టుకున్నారు.

## స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో డా. శివ సంతోష్ కుమార్ కి బెస్ట్ ఓరల్ పేపర్ అవార్డు



శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శివ సంతోష్ కుమార్ ఫిబ్రవరి 27 నుండి మార్చి 1వ తేది వరకు కమ్యూనిటీ మెడిసిన్ నేషనల్ కాన్ఫరెన్స్ నమో మెడికల్ కాలేజ్, దాద్రా నగర్ హవేలీ, డయ్యూ, డామన్ నందు బెస్ట్ ఓరల్ పేపర్ అవార్డు ను తీసుకున్నట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా? రామ్ గాతెలియజేశారు.5 సంవత్సరాల లోపు పిల్లలలో దోమతెర వాడకం గురించి రీసెర్చ్ స్టడీ ప్రజంట్ చేసి బెస్ట్ ఓరల్ పేపర్ అవార్డు (ఫ్యాకల్టీ కేటగిరీ లో) ను అందుకున్నారు.ఈ సందర్భంగా స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డా? ఆర్.వి. కుమార్ , కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా॥ నాగరాజ్ మరియు కమ్యూనిటీ మెడిసిన్ వైద్యులు అసిస్టెంట్ ప్రొఫెసర్ డా? శివ సంతోష్ కుమార్ ను అభినందించారు.

# మార్చి 19న మహతిలో ఉగాది సంబరాలు

టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ మరియు సంక్షేమ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలు మార్చి 19న తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించబడనున్నాయి.ఈ కార్యక్రమం ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుంది. ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో మంగళధ్వని నిర్వహించబడుతుంది. అనంతరం ఎస్వీ ఉన్నత వేద విద్యాధ్యయన సంస్థ పండితులు వేదపారాయణం చేస్తారు.ఉదయం 10.05 గంటలకు ప్రముఖ పండితులు పంచాంగ శ్రవణం చేపడుతారు. అటు తర్వాత కవి సమ్మేళనం జరుగుతుంది.అనంతరం డా. పూజారి వరలక్ష్మి భగవద్గీత అనుష్టానం, శ్రీ హేమ వేంకట నారాయణ భగవద్గీత అష్టావధానం నిర్వహిస్తారు. టీటీడీ ఉద్యోగుల పిల్లలతో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.పలు పోటీల్లో గెలిచిన ఉద్యోగులకు బహుమతులు అందజేస్తారు. చివరగా ఉగాది పచ్చడి ప్రసాదంగా పంపిణీ చేస్తారు.

## 20 లక్షల ఉద్యోగాల కల్పమే ఏకైక లక్ష్యం

### – మంత్రి లోకేష్

**మంగళగిరి** రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పమే మన ఏకైక లక్ష్యం కావాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ దిశానిర్దేశం చేశారు. మంగళగిరి సమీపం చినకాకానిలోని మయూరి టెక్ పార్క్ భవనం ఐదో అంతస్తులో ఏర్పాటుచేసిన ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్ మెంట్ బోర్డు(ంఖఇఆః) నూతన కార్యాలయాన్ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, ఏపీఈడీబీ సీఈవో సాయికాంత్ వర్మ, ఏపీఐఐసీ వైస్ ఛైర్మన్, ఎండీ ఎమ్.అభిషిక్త్ కిషోర్, ఉన్నతాధికారులు ఎంటీ కృష్ణబాబు, సౌరభ్ గౌర్ పాల్గొన్నారు.

# చండూరులో ఉద్రిక్తత



**నల్గొండ** నల్గొండ జిల్లా చండూరు పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ కార్యకర్తలపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారని ఆరోపిస్తూ, ఈ రోజు పట్టణ బంద్కు పిలుపునిచ్చారు రాష్ట్ర బీజేపీ నాయకుడు గంగిడి మనోహర్ రెడ్డి.బంద్లో భాగంగా చండూరు పట్టణంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహిస్తూ నినాదాలు చేశారు. అనంతరం ఎన్టీఆర్ ఎక్స్ రోడ్ వద్ద ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా గంగిడి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ కార్యకర్తలపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్కు పంపాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.దాడిలో మొత్తం ఎనిమిది మంది కార్యకర్తలు గాయపడగా, అందులో ఆరుగురికి తీవ్ర గాయాలు అయ్యాయని తెలిపారు. ఒకరికి తల గాయం కాగా, మరొకరికి పన్ను ఊడిపోయినట్లు చెప్పారు.పోలీసులు కాంగ్రెస్ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించిన ఆయన, దాడి చేసిన వారిపై 307 సెక్షన్ కింద కేసులు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ ఉద్యమాన్ని జిల్లా, రాష్ట్ర స్థాయికి తీసుకెళ్తామని హెచ్చరించారు.ఇక స్థానిక ఎమ్మెల్యే ప్రజల సమస్యలపై దృష్టి పెట్టడం లేదని విమర్శించిన ఆయన పోలీసులు కూడా ఈ ఘటనను తేలికగా తీసుకుంటున్నారని ఆరోపించారు. ఈ బంద్ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, జిల్లా నాయకులు పిల్లి రామరాజు యాదవ్ సహా పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫైరింగ్ రేంజ్‌లో సీపీ బంధువుల కాల్పులు

### – రేవంత్ రెడ్డిని నిలదీసిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

**హైదరాబాద్** కరీంనగర్ సీపీగౌస్ ఆలం భార్య గన్ ఫైర్ చేస్తే ఒక అభాగ్యురాలైన వృద్ధురాలికి బుల్లెట్ తగిలింది. కరీంనగర్ సమీపంలో ఉన్న ఒక ఫైరింగ్ రేంజ్లో సీపీ భార్య, అతని బంధువులు ఏకే 47, ఎస్ ఎల్ ఆర్ తుపాకీలతో కాల్పులు జరిపారని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆరోపించారు. ఈ క్రమంలో ఆ గ్రామానికి చెందిన ఒక వృద్ధురాలి తొడకు బుల్లెట్ తగిలి గాయం అయింది. ఈ అంశం వి6 పేపర్లో కూడా వచ్చింది. ప్రైవేట్ వ్యక్తులు ఫైరింగ్ రేంజ్లో కాల్పులు ఎలా జరుపుతారని ప్రశ్నించారు. హోంమంత్రి రేవంత్ రెడ్డికి తెలియకుండా ఇదంతా జరుగుతుందా అని నిలదీసారు. బహిరంగంగా కాల్పులు జరిపిన వార్తలు వస్తే రేవంత్ రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీసారు.

# గిట్టుబాటులేక.. ఫ్రీగా టమాట...



**మెదక్,** మాట రేట్లు దారుణంగా పడిపోవడంతో.. ఓ రైతు కీలక నిర్ణయం తీసుకున్నాడు. టమాటా పంటను మార్కెట్‌కు తీసుకురాగా.. అక్కడ గిట్టుబాటు ధర లేకపోవడంతో.. అక్కడికి వచ్చిన ప్రజలకు ఉచితంగా తన టమాట పంటను మొత్తం పంచిపెట్టాడు. ఫ్రీగా టమాటలు ఇస్తున్నారనే విషయం తెలియడంతో స్థానికులు ఒక్కసారిగా ఎగబడ్డారు. పండించిన పంటకు ధర లేకపోవడం పట్ల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మరికొందరు రైతులు టమాటలను కోయకుండా పొలాల్లోనే వదిలేస్తున్నారు.ప్రస్తుతం టమాటకు ధర లేక రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. భారీగా పెట్టుబడి పెట్టి టమాట పంటను పండించి.. కోసి మార్కెట్‌కు తీసుకువస్తే.. కనీసం రవాణా ఖర్చులు కూడా రావడం లేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు.. వినియోగదారులకు మాత్రం టమాట అంత తక్కువ ధరకు దొరకడం లేదు. మధ్యలో ఉన్న దళారులే టమాటపై భారీగా లాభాలు పొందుతున్నారు. అటు రైతులు, ఇటు వినియోగదారులకు లాభాలు లేకుండా.. దళారులే కొట్టేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులు.. టమాటను మార్కెట్‌కు తీసుకువచ్చి ధర లేక పారబోయడం, కనీసం మార్కెట్ ఖర్చులు కూడా రాకుండా బాధపడటం చూస్తూనే ఉన్నాం.ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ రైతు.. తాను పండించిన టమాట పంటను తీసుకుని మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మార్కెట్‌కు వచ్చాడు. అయితే కిలో టమాటకు దళారులు కేవలం రూ.5 మాత్రమే చెల్లిస్తుండడంతో తీవ్ర అసహనానికి గురయ్యాడు. కొత్తగూడలో సంత కావడంతో గూడూరు మండలం భూపతిపేట గ్రామానికి చెందిన ఒక రైతు ఆటోలో టమాటాలను తీసుకొచ్చాడు. అయితే టమాట పంటను కొనుగోలు చేసేందుకు అక్కడ వ్యాపారులు ఎవరూ ముందుకు రాలేదు.దీంతో తమ గ్రామం నుంచి అంతదూరం ఆటోలో టమాట పంటను తీసుకొచ్చిన ఆ రైతు.. మళ్లీ తిరిగి ఇంటికి తీసుకెళ్లలేక అక్కడే ఉచితంగా పంచిపెట్టాడు. తాను తీసుకొచ్చిన ఆటోలో టమాటాలను ఓపెన్ చేసి.. అక్కడికి వచ్చిన వారికి ఫ్రీగా ఇచ్చేశాడు. దీంతో ఫ్రీగా టమాటాలు వస్తుండటంతో స్థానికులు భారీగా ఎగబడ్డారు.ప్రస్తుతం మార్కెట్‌లో టమాటలకు ధర లేకపోవడంతో టమాట పండించిన రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. పెట్టిన పెట్టుబడి పక్కన పెడితే.. కనీసం వాటిని తెంచడానికి అయిన కూలీల ఖర్చు, మార్కెట్‌కు తీసుకొచ్చిన ఖర్చులు కూడా రావడం లేదని.. తమ చేతి నుంచే ఎదురు ఖర్చులు చేయాల్సి వస్తోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో టమాటకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని రైతులు వేడుకుంటున్నారు.మరికొందరు రైతులు టమాట పంట పండినా.. ధర లేకపోవడంతో.. వాటిని తెంపితే కూలీల ఖర్చు అవుతుందని.. వాటిని అమ్మినా ఆ ఖర్చులు కూడా రావని భావించి.. పొలాల్లోనే అలాగే వదిలేస్తున్నారు. మరికొందరు రైతులు పశువులకు మేతగా టమాటలను వేస్తున్నారు. ఇంకొందరు రైతులు.. తమ పొలాల్లోకి వచ్చి ఎవరైనా ఫ్రీగా కోసుకుని వెళ్లొచ్చని ఆఫర్లు ఇస్తున్నారు. వేలకు వేల రూపాయలు పెట్టుబడి పెట్టి టమాట పంటను సాగుచేస్తే.. పంట చేతికి వచ్చిన తర్వాత రేటు దారుణంగా పడిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లుతోందని వాపోతున్నారు. బయట కూరగాయల మార్కెట్లో మాత్రం వినియోగదారులకు కిలో టమాటా రూ.20 కి తక్కువకు దొరకకపోవడం గమనార్హం.

# జిల్లాలో గ్యాస్ కొరత లేదు..

### – జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా...



**కడప** గ్యాస్ సరఫరాపై కొన్ని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులు నమ్మవద్దని, అందులో ఏ మాత్రం వాస్తవం లేదని, జిల్లాలో ఎలాంటి గ్యాస్ కొరత లేదని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా తెలిపారు.సోమవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలు నందు సంభందిత అధికారులతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. . ఈ సందర్భంగా జెసి డా. నిధి మీనా మాట్లాడుతూ.. జిల్లాలోని 58 గ్యాస్ ఏజెన్సీలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. అలాగే సంభందిత డివిజనల్ అధికారులను పర్యవేక్షణాధికారులుగా నియమించమన్నారు. జిల్లా మరియు డివిజనల్ స్థాయిలో కంట్రోల్ రూములను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అసత్య ప్రచారాలు నమ్మి వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వినియోగదారుల అవసరాలకు తగిన విధంగా యల్.పి.జి. నిల్వలు అందుబాటులో ఉండేలా పటిష్ట చర్యలు చేపడుతామని తెలిపారు.జిల్లాలో గృహ అవసరాల వినియోగ గ్యాస్ కొరత ఎలాంటి పరిస్థితుల్లోనూ ఉండదన్నారు. గ్యాస్ కంపెనీల ద్వారా సరఫరా సాధారణంగానే కొనసాగుతుందని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్యాస్ కొరత వస్తుందనే ఉద్దేశంతో వెంట వెంటనే ఆన్లైన్లో గ్యాస్ బుకింగ్ చేయడానికి వెబ్ పోర్టల్అనుమతించదని కేవలం 25/45 రోజులు (పట్టణ/గ్రామీణ వినియోగదారులు) గడువులో మాత్రమే గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని వినియోగదారులకు సూచించారు. గృహ అవసరాలు, సంక్షేమ వసతి గృహాలు మరియు ఇతర అత్యవసర సేవలకు గ్యాస్ సరఫరాలో నిలుపుదల ఉండదని స్పష్టం చేశారు.అవసరానికి మించి గ్యాస్ సిలిండర్ల ను నిల్వ చేయడం లేదా కొనుగోలు చేయడం చేయరాదన్నారు. ప్రభుత్వం మరియు జిల్లా పాలన యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తున్నాయన్నారు. ప్రజలు అపోహలను నమ్మకుండా అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలన్నారు. గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లను (14.21 కెజి) వాణిజ్యఅవసరాల కోసం తరలించిన/ వినియోగించిన అట్టి వారిపై నిత్యావసరాల చట్టం 1955, ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సంప్రదించవలసిన అధికారులు...:జిల్లా స్థాయి (కడప జిల్లా)కలెక్టర్ కంట్రోల్ రూమ్ ? 08562-246344కడప డివిజన్రోహిత్, సీనియర్ అసిస్టెంట్, ఆర్డీవో కార్యాలయం ? 9966225191బద్వేల్ డివిజన్ఖాజా, ఇ డి ఎం, ఆర్డీవో కార్యాలయం ? 8978089263జమ్మలమడుగు డివిజన్ప్రసన్నకుమార్, కంప్యూటర్ ఆపరేటర్ ? 9502836762పులివెందుల డివిజన్సుబ్బయ్య, సీనియర్ అసిస్టెంట్ ? 9963464408రాజంపేట డివిజన్హరిత, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ ? 7288840563ఈ సమావేశంలో డిఎస్ఓ రఘురాం, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

## వైవీయూ అభివృద్ధికి నిధులు కేటాయించండి



**కడప** యోగి వేమన విశ్వవిద్యాలయ మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం 100 కోట్ల రూపాయలు కేటాయించాలని వైవీయు పరిరక్షణ సమితి కన్వీనర్ అమృత్ కుమార్ మరియు ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేష్ యాదవ్ కోరారు.

సోమవారం కలెక్టర్ ఆఫీసులోని ప్రజా సమస్యల పరిష్కార విభాగంలో సంబంధిత అధికారులకు వినతి పత్రం అందించారు. గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన నేపథ్యం నుండి వచ్చిన విద్యార్థులకు సేవలు అందిస్తున్న ఈ విశ్వవిద్యాలయంలో అకడమిక్ భవనాలు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, వసతి గృహాల సౌకర్యాల ఆధునీకరణకు నిధులు కేటాయించాలని కోరారు. అలాగే నూతన ఆడిటోరియం మరియు హెల్త్ సెంటర్ భవనాలను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ ప్రతిపాదిత నిధుల కేటాయింపు విద్యా, పరిశోధన సామర్థ్యాలను పెంచి, ప్రాంత విద్యార్థులకు ప్రయోజనం చేకూరుస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైవియు పరిరక్షణ కమిటీ కో కన్వీనర్ భరత్ సింహా, ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యదర్శి సాయి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను
# పంపిణీ చేసిన ఎన్ఎండి ఫిరోజ్




**నంద్యాల..** నంద్యాల నియోజకవర్గంలో మంత్రి ఫరూక్ తనయుడు నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ప్రజలకు నేనున్నానంటూ భరోసా కల్పిస్తున్నారు. ప్రజలు ఆపద సమయాల్లో అందించే మెడికల్ రీయబర్స్మెంట్ ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్దిదారులకు ఈరోజు నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్ టాకీస్) లో గత 4 రోజుల కిందట మంత్రి ఫరూక్ గారు ఇచ్చిన తర్వాత మిగిలిన 24 చెక్కులను బాధ్యత కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగిందన్నారుఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గ వ్యాప్తంగా 23 వ సారి 33 లక్షల 57 రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధ్యత కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగిందని తెలిపారు . కూటమి ప్రభుత్వం అనారోగ్యంతో వైద్యం చేయించుకున్న లబ్ధిదారులకు ఆర్థికంగా ఆదుకునేందుకు సహాయ నిధిని అందిస్తున్నట్లు తెలిపారు . నంద్యాల టౌన్ , నంద్యాల మండలం మరియు గోస్పాడు మండల ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందించారు . ముఖ్యమంత్రి సహాయ నిధిని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, మంత్రులు నారా లోకేష్ , ఎన్ఎండి ఫరూక్ లతో పాటు ఫిరోజ్ , ఫయాజ్ లకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారుఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి , టిడిపి రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు , వంటలగల భాస్కర్ రెడ్డి, ఎం కృష్ణాపురం బాలీశ్వర్ రెడ్డి , శేఖర్ రెడ్డి, యాలూరు వెంకట్ రెడ్డి, గోస్పాడు విశ్వనాథరెడ్డి, మాజీ కౌన్సిలర్లు కృపాకర్, సుంకన్న , నెహ్రూ నగర్ వేమారెడ్డి , క్లస్టర్ ఇంచార్జ్ కామిని మల్లికార్జున , 19 టీడీపీ ఇంచార్జ్ షేక్ మహమ్మద్ రఫీ (మున్నా) మరియు టిడిపి నాయకులు పాల్గొన్నారు

## ఆశావహుల వ్యూహం - ప్రతిపక్షాల లీకులు

**విజయవాడ,** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గత కొద్దిరోజులుగా సెగలు పుట్టిస్తున్న కేబినెట్ విస్తరణ వార్తలపై స్పష్టత వస్తోంది. సోషల్ మీడియా వేదికగా సాగుతున్న ప్రచారానికి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలకు పొంతన లేదని ...చంద్రబాబు మార్క్ రాజకీయం తెలిసిన ఎవరైనా.. ఈ తరుణంలో మంత్రివర్గ మార్పులు సాధ్యం కాదని అంచనా వేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తుతం అత్యంత క్లిష్టమైన ఆర్థిక పరిస్థితుల మధ్య రాష్ట్రాన్ని నడుపుతున్నారు. అమరావతి నిర్మాణానికి నిధుల సమీకరణ, పోలవరం పనుల పునరుద్ధరణ వంటి భారీ లక్ష్యాలు ఆయన ముందున్నాయి. ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు కూడా పూర్తికాకముందే మంత్రివర్గంలో మార్పులు చేస్తే, అది అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు పాలనాపరమైన అయోమయానికి దారితీస్తుంది. అందుకే, ప్రస్తుతం తన ఫోకస్ అంతా మిషన్ బిల్డ్ ఏపీ పైనే తప్ప, రాజకీయ పదవుల పంపకంపై లేదని ఆయన స్పష్టమైన సంకేతాలిస్తున్నారు.సాధారణంగా చంద్రబాబు మంత్రులకు తనదైన శైలిలో రిపోర్ట్ కార్డ్స్ ఇస్తుంటారు. ప్రస్తుతం ఉన్న మంత్రులు తమ శాఖలపై పట్టు సాధించి, క్షేత్రస్థాయిలో ఫలితాలు చూపడానికి కనీసం రెండేళ్ల సమయం ఇవ్వాలని ఆయన భావిస్తున్నారు. అప్పుడే ఎవరు సమర్థులు, ఎవరు విఫలమయ్యారనేది స్పష్టమవుతుంది. ఇప్పుడున్న మంత్రుల పనితీరును ర్యాంకింగ్‌ల ద్వారా పర్యవేక్షిస్తున్న సీఎం, ఇప్పుడే మార్పులు చేసి వారిలో నిరాశ నింపడం కంటే, వారిని మరింత ఉత్సాహపరిచి పని చేయించుకోవడమే ఉత్తమమని భావిస్తున్నారు.మంత్రివర్గ విస్తరణ వార్తలు పుట్టడానికి రెండు ప్రధాన కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి, పదవులు ఆశిస్తున్న సీనియర్ ఎమ్మెల్యేలు తమ పేర్లను చర్చల్లో ఉంచడం ద్వారా అధిష్టానంపై ఒత్తిడి పెంచాలని చూడటం. రెండు, కూటమిలో అంతర్గత విభేదాలు ఉన్నాయని చూపేందుకు ప్రతిపక్షాలు సోషల్ మీడియా వేదికగా ఇటువంటి లీకులను వదిలి ఉండవచ్చు. అయితే, పవన్ కళ్యాణ్ , చంద్రబాబు మధ్య ఉన్న దృఢమైన సమన్వయం దృష్ట్యా, ఇటువంటి ప్రచారాలు కూటమిపై పెద్దగా ప్రభావం చూపడం లేదని భావిస్తున్నారు. ప్రభుత్వానికి ఇప్పుడు అతిపెద్ద సవాలు సూపర్ సిక్స్ హామీల అమలు. ఉగాది నాటికి ఇళ్ల పట్టాల పంపిణీ, గృహ నిర్మాణ పనుల్లో వేగం పెంచడంపై సీఎం సీరియస్ డెడ్ లైన్లు విధించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి, రాజకీయ సమీకరణాల కోసం పదవులు పంచుకుంటే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని చంద్రబాబుకు తెలుసని అంటున్నారు. రాజకీయాల కంటే ప్రజా సేవ అన్న నినాదంతోనే ముందుకు వెళ్లాలని ఆయన తన కేబినెట్ సహచరులకు సైతం దిశానిర్దేశం చేస్తున్నారు. ఉగాది నాటికి మంత్రి పదవులు దక్కుతాయని ఎదురుచూస్తున్న ఆశావహులకు నిరాశే మిగిలేలా ఉంది. రాజకీయ అవసరాల కంటే పాలనాపరమైన అవసరాలకే చంద్రబాబు పెద్దపీట వేస్తారు. ప్రస్తుతం ఉన్న మంత్రులందరూ తమ స్థానాల్లో సురక్షితంగా ఉన్నారని, కేబినెట్ విస్తరణ అనేది ప్రస్తుతానికి అజెండాలోనే లేని అంశమని స్పష్టమవుతోందని అనుకోవచ్చు.

## ఏపీలో ఇక ఆఫీసర్ల హవా

**విజయవాడ,** ఏపీలో ఇక ఆఫీసర్ల హవా.. లీడర్ల దారెటు? నగరాలు, పట్టణాల్లో రాజకీయం కొత్త టర్న్ తీసుకుంటుందా?రాష్ట్రంలో అధికారం మారిన పరిస్థితుల్లో లీడర్లు జంపింగ్‌లకు రెడీ అవుతున్న పరిస్థితి ఉంది. క్యాస్ట్ ఈక్వేషన్, ఆర్థిక, అంగ బలాన్ని లెక్కలేసుకుని పార్టీలు మారితే మళ్లీ పదవులు చేపట్టొచ్చని వలస పక్షుల ఆలోచనగా చెబుతున్నారు. పాలక వర్గాల గడువు ముగుస్తుంది. అధికారుల పాలన రానుంది. ఏపీలోని 86 నగర పంచాయతీలు, 11 మున్సిపల్ కార్పొరేషన్లు, 75 మున్సిపాలిటీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించింది ప్రభుత్వం. కొత్తగా కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఎన్నికై..పాలకవర్గాలు కొలువుదీరే వరకు మున్సిపాలిటీల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలనలో కొనసాగనుంది. దాదాపు 90 శాతం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ప్రత్యేకాధికారుల పాలన కిందకు వెళ్లిపోనున్నాయి. కార్పొరేషన్లకు ఐఏఎస్ స్థాయి ఆఫీసర్లను, మున్సిపాలిటీలకు ఆర్డీవో క్యాడర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించింది సర్కార్. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, తిరుపతి, కడప, కర్నూలు, అనంతపురం కార్పొరేషన్లకు ఐఏఎస్ అధికారులు స్పెషల్ ఆఫీసర్లుగా వ్యవహంచనున్నారు. మళ్లీ ఎన్నికలు జరిగి మేయర్లు బాధ్యతలు స్వీకరించే వరకు వీరి ఆధ్వర్యంలో ఆయా నగరాల్లో పాలన వ్యవహారాలు కొనసాగనున్నాయి.మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పాలక వర్గాల పదవీ కాలం ముగియడంతో లీడర్లు కుర్చీలను ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచిపోతున్నా ఇప్పటివరకు 90 శాతం మున్సిపాలిటీలు వైసీపీ నేతల చేతుల్లోనే ఉన్నాయి. ఆ పార్టీకి చెందిన నేతలే మున్సిపల్ ఛైర్మన్లుగా, మేయర్లుగా కొనసాగుతున్నారు. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఒక్క తాడిపత్రి మినహా రాష్ట్రంలో మిగిలిన అన్నిచోట్ల వైసీపీనే పాగా వేసింది.అసెంబ్లీ ఎన్నికల తర్వాత కొన్ని చోట్ల రాజకీయ పరిస్థితులు మారడం, కౌన్సిలర్లు పార్టీ ఫిరాయించడంతో..పది పదిహేను మున్సిపాలిటీలను టీడీపీ కైవసం చేసుకుంది. అయినప్పటికీ ఇప్పటికీ మెజార్టీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వైసీపీ నేతలే ఛైర్మన్లు, మేయర్లుగా ఉన్నారు. పదవీ కాలం పూర్తి కావడంతో వాళ్లంతా మాజీలు అవుతున్నారు. దీంతో నగరాలు, పట్టణాల్లో పొలిటికల్ ఈక్వేషన్స్ మారుతున్నట్లు కనిపిస్తోంది.జూన్‌లోపు మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే యోచనలో కూటమి సర్కార్ ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో అప్పుడే పట్టణాల్లో రాజకీయ వేడి వేడెక్కుతోంది. ఇప్పటికే కౌన్సిలర్లు, కార్పొరేటర్లుగా పని చేస్తున్న వాళ్లు బరిలోకి దిగేందుకు సిద్ధపడుతుండగా..కొత్తగా మరికొందరు లీడర్లు ఎన్నికల రంగంలోకి దిగేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. మరోవైపు రాష్ట్రంలో అధికారం మారిన పరిస్థితుల్లో లీడర్లు జంపింగ్‌లకు రెడీ అవుతున్న పరిస్థితి ఉంది. క్యాస్ట్ ఈక్వేషన్, ఆర్థిక, అంగ బలాన్ని లెక్కలేసుకుని పార్టీలు మారితే మళ్లీ పదవులు చేపట్టొచ్చని వలస పక్షుల ఆలోచనగా చెబుతున్నారు.కార్పొరేషన్లలో అయితే పొలిటికల్ హీట్ నెక్స్ట్ లెవల్‌కు చేరుకుంటుంది. పలు చోట్ల ఇప్పటికే మేయర్ కుర్చీలు టీడీపీ ఖాతాలో ఉండగా..కడప లాంటి చోట వైసీపీ పట్టు కొనసాగిస్తోంది. దీంతో గతంలో వైసీపీ గెలిచినట్లు వార్ వన్ సైడే అన్నట్లుగా మున్సిపల్ ఎన్నికల్లో పాగా వేయాలని ప్లాన్ చేస్తోందట కూటమి. ఇదే అదునుగా పార్టీ మారాలనుకుంటున్న పలువురు లీడర్లు కూడా పావులు కదుపుతున్నట్లు ఇన్ సైడ్ టాక్. పురపోరు నాటికి లీడర్ల జంపింగ్‌లు, పొలిటికల్ ఈక్వేషన్లు ఎలా మారుతాయో? తాజా మాజీలు మళ్లీ ఎన్నికల బరిలో నిలుస్తారో లేదో? ఒకవేళ పోటీ చేసినా ఏ పార్టీ నుంచి ఎవరు బరిలోకి దిగుతారోనని లోకల్ పాలిటిక్స్ అప్పుడే వేడెక్కుతున్నాయి

## వారసత్వ స్థలాల రిజిస్ట్రేషన్ మరింత
## జస్ట్ ఇలా చేస్తే చాలు..!

**విజయవాడ,** కొత్త మార్గదర్శకాలతో ఇకపై రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన బాధ ఉండదు. నేరుగా సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకునే వెసులుబాటు కలిగింది.వారసత్వంగా లభించే వ్యవసాయేతర స్థలాల రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఏపీ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. వారసత్వంగా లభించే వ్యవసాయేతర స్థలాల రిజిస్ట్రేషన్ ప్రాసెస్ ను మరింత ఈజీ చేసింది. వారసత్వంగా లభించే వ్యవసాయేతర స్థలాల రిజిస్ట్రేషన్లపై ప్రభుత్వం కొత్త గైడ్ లైన్స్ రిలీజ్ చేసింది.

ఈ మార్గదర్శకాల ప్రకారం ఇకపై గ్రామాల్లోని వారసత్వంగా లభించే వ్యవసాయేతర స్థలాల రిజిస్ట్రేషన్‌కు రెవెన్యూ శాఖ సర్టిఫికెట్ అవసరం లేదు. స్థలం యజమానుల సెల్ఫ్ డిక్లరేషన్ ఇస్తే చాలు. తమకు పూర్వీకుల నుంచే ఆస్తి వచ్చిందని, నిషేధిత జాబితా(22ఎ)లో లేదని, తామే పూర్తి హక్కుదారు అని అందులో స్పష్టంగా పేర్కొనాలి. అయితే, ఇక్కడ ఒక విషయం గుర్తు పెట్టుకోవాలి. ఒకవేళ తప్పుడు సమాచారం ఇస్తే కనుక కఠిన చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది.ఇటువంటి ఆస్తుల బదలాయింపు పెద్ద ప్రహసనంగా ఉండేది. పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన వ్యవసాయేతర భూములను రిజిస్ట్రేషన్ చేసేందుకు హక్కు ఉన్నట్లు యజమానుల దగ్గర ఎలాంటి ఆధారాలు ఉండవు. దీంతో భవిష్యత్తులో సమస్యలు రాకుండా రెవెన్యూ శాఖ నుంచి యాజమాన్య హక్కు ఉన్నట్లుగా ధృవీకరణ పత్రాలు తీసుకురావాలని రిజిస్ట్రార్లు అడుగుతున్నారు.

అయితే రెవెన్యూ శాఖ నుంచి సర్టిఫికెట్ తీసుకోవడం సామాన్యులకు పెను భారం అవుతోంది. ఈ ఇబ్బందులను తొలగిస్తూ రిజిస్ట్రేషన్ నిబంధనలను సవరించింది ప్రభుత్వం. కొత్త మార్గదర్శకాలతో గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పాత ఇళ్లు, స్థలాల రిజిస్ట్రేషన్లు జాప్యం లేకుండా వేగంగా పూర్తి కానున్నాయి.వారసత్వ ఆస్తుల నమోదు కోసం యజమానులు ఇచ్చే సెల్ఫ్ డిక్లరేషన్ పత్రాన్నే ప్రామాణికంగా తీసుకోనున్నారు. ఆ ఆస్తి తమ పూర్వీకుల నుంచి సంక్రమించిందని, దానిపై తమకు పూర్తి యాజమాన్య హక్కులు ఉన్నాయని యజమానులు లిఖితపూర్వకంగా ఇస్తే సరిపోతుంది. కొత్త మార్గదర్శకాలతో ఇకపై రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన బాధ ఉండదు. నేరుగా సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకునే వెసులుబాటు కలిగింది. ప్రభుత్వ నిర్ణయంపై సామాన్య ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ఈ సెల్ఫ్ డిక్లరేషన్‌కు సంబంధించి యజమానులు కొన్ని ముఖ్యమైన అంశాలను స్పష్టంగా పొందుపరచాలి. సంబంధిత స్థలం లేదా ఆస్తి ప్రభుత్వం ప్రకటించిన నిషేధిత జాబితా (సెక్షన్ 22ఎ)లో లేదని ధృవీకరించాలి. అంతేకాదు ఎలాంటి వివాదాలు లేని పూర్తి హక్కుదారు తామేనని డిక్లరేషన్‌లో పేర్కొనాలి. మరో ముఖ్యమైన విషయం గుర్తుంచుకోవాలి. సెల్ఫ్ డిక్లరేషన్ పత్రంలో ఎవరైనా ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చినా, వాస్తవాలను దాచి పెట్టినా వారిపై చట్టపరమైన చర్యలు (సివిల్, క్రిమినల్ కేసులు) తప్పవు.

## హెచ్ఓడీ టవర్ల నిర్మాణంలో కీలక ఘట్టం

**అమరావతి,** ఏపీ రాజధాని అమరావతి నిర్మాణం వేగం పుంజుకుంది. అమరావతి నిర్మాణంలో భాగంగా జీఏడీ, హెచ్ఓడీ టవర్లు నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. జీఏడీ టవర్ 47 అంతస్థులతో, మిగతా నాలుగు హెచ్ఓడీ టవర్లను 40 అంతస్తులతో నిర్మిస్తున్నారు. డయాగ్రిడ్ విధానంలో ఈ పనులు చేపట్టనున్నారు. ఈ క్రమంలోనే టవర్ -1కు సంబంధించి మొదటి స్టీల్ డయాగ్రిడ్ అమర్చే పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. మంత్రి నారాయణ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. 2028 అక్టోబర్ నాటికల్లో టవర్ల నిర్మాణం పూర్తి చేస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులలో వేగం పెరిగింది. సోమవారం రోజున అమరావతిలోని హెచ్ఓడీ టవర్ల నిర్మాణంలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. హెచ్ఓడీ టవర్ల నిర్మాణంలో భాగంగా టవర్ -1కు మొదటి స్టీల్ డయాగ్రిడ్ అమర్చే పనులు ప్రారంభమయ్యాయి. ఏపీ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ చేతుల మీదుగా ఈ పనులు ప్రారంభమయ్యాయి. అనంతరం విలేకర్లతో మాట్లాడిన మంత్రి నారాయణ .. అమరావతి రైతులకు చెప్పిన మాట ప్రకారమే రాజధాని నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. అమరావతి జీఏడీ, హెచ్ఓడీ టవర్ల నిర్మాణంలో భాగంగా డయాగ్రిడ్ టెక్నాలజీతో మొత్తం ఐదు టవర్లు నిర్మిస్తున్నట్లు నారాయణ వెల్లడించారు.47 అంతస్తులలో జీఏడీ టవర్ నిర్మాణం చేపట్టనున్నట్లు మంత్రి నారాయణ వివరించారు. మిగతా టవర్లను 40 అంతస్తులతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. 53 లక్షల చదరపు అడుగుల బిల్ట్ ఏరియాతో టవర్ల నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. అన్ని కార్యాలయాలు, అధికార యంత్రాంగం మొత్తం ఒకేచోట ఉండేలా ఈ టవర్లను డిజైన్ చేసినట్లు తెలిపారు. 2028 అక్టోబర్ నాటికి జీఏడీ, హెచ్ఓడీ టవర్ల నిర్మాణం పూర్తి చేస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.మరోవైపు మూడు ప్యాకేజీల కింద అమరావతిలో టవర్ల నిర్మాణం చేపడుతున్నారు. రూ.4,688.82 కోట్ల అంచనా వ్యయంతో వీటి నిర్మాణం చేపట్టారు. మొదటి ప్యాకేజీ కింద రూ.1,126.51 కోట్లతో జీఏడీ టవర్ నిర్మిస్తున్నారు. రెండో ప్యాకేజీ పనుల కింద 1,897.86 కోట్ల రూపాయలతో 1, 2 టవర్లు నిర్మించనున్నారు. మూడో ప్యాకేజీ పనుల కింద రూ.1,664.45 కోట్లతో మూడు, నాలుగో టవర్లు నిర్మించనున్నారు. ఈ ఐకానిక్ టవర్ల నిర్మాణం డయాగ్రిడ్ విధానంలో చేపట్టనున్నారు.టవర్లలో జీఏడీ టవర్ అన్నింటికంటే ఎత్తు ఉండనుంది. బేస్‌మెంట్, గ్రౌండ్ ఫ్లోర్ కాకుండా జీఏడీ టవర్‌ను 47 అంతస్తులుగా నిర్మించనున్నారు. ఇందులోనే సీఎం ఆఫీస్ ఉంటుంది. జీఏడీ టవర్ టెర్రస్‌పై హెలిప్యాడ్ నిర్మించనున్నారు. మిగతా నాలుగు హెచ్ఓడీ టవర్లను 40 అంతస్తుల చొప్పున నిర్మించనున్నారు. ఇక ఈ డిజైన్ 60 వేల టన్నుల స్టీల్ అవసరమవుతుందని అంచనా.

## ఒంటిమిట్టలో నిత్యాన్నదాన పథకం

**కడప,** తిరుమల తరహాలోనే ఒంటిమిట్టలోనూ నిత్యాన్నదానం కార్యక్రమం ప్రారంభమైంది. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు చేతుల మీదుగా సోమవారం నిత్యాన్నదానం కార్యక్రమం ప్రారంభమైంది. ఇకపై తిరుమల తరహాలోనే ఒంటిమిట్టలోనూ భక్తులకు నిత్యాన్నదానం అందుబాటులో ఉంటుంది. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో నిత్యం మూడు పూటలా భక్తులకు అన్నదాన వితరణ జరుగుతుందని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. ఒంటిమిట్ట రామాలయంలో బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో నిత్యాన్నదాన కార్యక్రమం ప్రారంభించారు.ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయానికి వెళ్లే భక్తులకు తీపికబురు. తిరుమల తరహాలోనే ఒంటిమిట్టలోనూ నిత్యాన్నదానం కార్యక్రమం అందుబాటులోకి వచ్చింది. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు.. ఒంటిమిట్టలో నిత్యాన్నదానం కార్యక్రమం ప్రారంభించారు. సోమవారం ఒంటిమిట్టలోని ఆలయాన్ని దర్శించుకున్న టీటీడీ ఛైర్మన్.. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానాల తరఫున నిత్యాన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఇకపై ఒంటిమిట్టలో భక్తులకు ప్రతిరోజూ మూడు పూటల అన్నప్రసాదాలు అందించనున్నారు. మరోవైపు ఒంటిమిట్టలోని కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 26వ తేదీ నుంచి ఏప్రిల్ ఐదో తేదీ వరకూ జరగనున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు.మరోవైపు ఒంటిమిట్ట లో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను టీటీడీ పర్యవేక్షిస్తోంది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల పనులు వేగంగా జరుగుతున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. టీటీడీలోని అన్ని విభాగాలు, జిల్లా అధికారుల సమన్వయంతో పనులు చేపడుతున్నాయి. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మార్చి 24వ తేదీన ఒంటిమిట్ట రామాలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. మార్చి 26వ తేదీన బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరగనుంది.బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉదయం, సాయంత్రం వాహన సేవలు నిర్వహిస్తారు. మార్చి 27వ తేదీ నుంచి వాహన సేవలు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ ఒకటో తేదీ సాయంత్రం 6 గంటల 30 నిమిషాల నుంచి రాత్రి 8 గంటల 30 నిమిషాల వరకూ సీతారాముల కళ్యాణం జరగనుంది. సీతారాముల కళ్యాణానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో టీటీడీ విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తోంది.మరోవైపు ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో మార్చి 25వ తేదీ ఉదయం పసుపు దంచే కార్యక్రమం నిర్వహించనున్నారు. మార్చి 27వ తేదీ నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఏప్రిల్ ఒకటో తేదీ అత్యంత వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం జరగనుంది. ఈ కళ్యాణోత్సవంలో ఈ పసుపును వినియోగించనున్నారు. ఇందుకోసం పసుపు దంచే కార్యక్రమం చేపట్టడం ఆనవాయితీ.

### తొలి దశలో 46 కిలోమీటర్ల
## వైజాగ్ మెట్రో

**విశాఖపట్టణం,** విశాఖ మెట్రో రైలు నిర్మాణంపై మంత్రి నారాయణ కీలక ప్రకటన చేశారు. విశాఖ మెట్రోకు త్వరలోనే కేంద్రం నుంచి అనుమతులు రానున్నట్లు తెలిపారు. 3 ఏళ్లలో వైజాగ్ మెట్రోను పూర్తి చేస్తామని తెలిపారు. తొలి దశలో 46.23 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. అదే సమయంలో విశాఖలో సెమీ రింగ్ రోడ్డు నిర్మించనున్నట్లు వెల్లడించారు. అటు.. విజయవాడ మెట్రో నిర్మాణంపైనా మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు.ఆంధ్రప్రదేశ్ ఐటీ రాజధాని అయిన విశాఖపట్నం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. అంతర్జాతీయ కంపెనీలు విశాఖకు వస్తుండటంతో.. అందుకు తగ్గట్లు రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతుల కల్పన చేస్తోంది. అందులో భాగంగానే విశాఖలో మెట్రో, సెమీ రింగ్ రోడ్డు, నగర రోడ్లకు సంబంధించిన పనులపై దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలోనే విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించి.. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ బిగ్ అప్‌డేట్ ఇచ్చారు. రెండు, మూడు రోజుల్లోనే కేంద్ర ప్రభుత్వం నుంచి విశాఖ మెట్రో ప్రాజెక్టుకు అనుమతులు రానున్నట్లు తెలిపారు.విశాఖపట్నం మెట్రో ప్రాజెక్ట్ ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉందని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. విశాఖ మెట్రో ప్రాజెక్టుపై రైడర్స్ సంస్థ అధ్యయనం చేస్తోందని వివరించారు. ఆ సంస్థ అధ్యయనం 2 నెలల్లో పూర్తి అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. త్వరలోనే విశాఖ మెట్రో నిర్మాణం కోసం టెండర్లను పిలవనున్నట్లు వెల్లడించారు.

3 ఏళ్లల్లో వైజాగ్ మెట్రోను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టం చేశారు. విశాఖలో పట్టణ, గృహ నిర్మాణ శాఖపై జరిగిన రీజినల్ వర్క్ షాప్‌లో పాల్గొన్న నారాయణ.. ఈ వ్యాఖ్యలు చేశారు.తొలి దశ విశాఖ మెట్రో నిర్మాణంలో భాగంగా వైజాగ్ స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది వరకు మొత్తంగా 46.23 కిలోమీటర్ల మేర నిర్మాణం చేపట్టనున్నారు. ఈ తొలి దశలో 3 కారిడార్లు ఏర్పాటు చేయనున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది వరకు ఒక కారిడార్.. ఓల్డ్ పోస్టాఫీస్ నుంచి గురుద్వారా వరకు రెండో కారిడార్.. చినవాల్తేరు నుంచి తాటిచెట్లపాలెం వరకు మూడో కారిడార్ నిర్మించనున్నారు. ఈ 46.23 కిలోమీటర్ల మార్గంలో.. 20.16 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ విధానంలో మెట్రో రైలు మార్గాన్ని నిర్మించనున్నారు. అంటే దాదాపు సగం మార్గం డబుల్ డెక్కర్ విధానంలోనే ఉండనుంది.మరోవైపు.. విశాఖ మెట్రో ప్రాజెక్టుకు కేంద్రం అనుమతులు ఇవ్వగా.. డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ (డీపీఆర్)ను తయారు చేయడానికి కేంద్రం నుంచి అనుమతి రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే విశాఖ మెట్రో డీపీఆర్‌కు త్వరలోనే కేంద్రం నుంచి అనుమతులు రానున్నాయి. ఆ తర్వాత టెండర్లు పిలిచి పనులు ప్రారంభించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సంయుక్తంగా ఈ విశాఖ మెట్రో నిర్మాణాన్ని చేపట్టనున్నాయి.ఇందులో కేంద్ర ప్రభుత్వం తన వాటాగా కొంత మొత్తాన్ని కేటాయించేందుకు అంగీకరించింది. మరోవైపు.. విజయవాడ మెట్రోకు కూడా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన సంగతి తెలిసిందే. విజయవాడ మెట్రోకు త్వరలోనే సర్వే చేపట్టనుండగా.. ఆ తర్వాత డీపీఆర్‌ను తయారు చేసి ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపించనున్నారు.మరోవైపు.. హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లాగానే విశాఖపట్నంలో కూడా సెమీ రింగ్ రోడ్డు నిర్మాణం చేపడతామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఈ సెమీ రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తి అయితే విశాఖలో ట్రాఫిక్ భారీగా తగ్గతుందని పేర్కొన్నారు. సెమీ రింగ్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి వీఎంఆర్డీఏ అధ్యయనం చేస్తోందని.. విశాఖ అభివృద్ధి కోసం హడ్కో సహకారం ముఖ్యమని మంత్రి తెలిపారు.కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు ఆదాయాన్ని సమకూర్చుకునే మార్గాలను అన్వేషించనున్నట్లు పేర్కొన్నారు. రాంబిల్లి–భోగాపురం ప్రాజెక్టును వీఎంఆర్‌డీఏ పరిశీలిస్తోందని తెలిపిన మంత్రి నారాయణ.. మాస్టర్‌ప్లాన్ రోడ్డులో ఒక రోడ్డుకు అటవీ భూమి అడ్డుగా ఉందని వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లను కలిసి మాట్లాడి సమస్యను పరిష్కరించనున్నట్లు స్పష్టం చేశారు.

## భార్యాభర్తల మధ్య ఘర్షణ భార్యకు కత్తిపోట్లు

### - పోలీసులకు లొంగిపోయిన భర్త



**యాదాద్రి భువనగిరి** ఆత్మకూరు మండల లకేంద్రంలో భార్యాభర్తల మధ్య గొడవ చెలరేగింది. భర్త మహేష్ పై భార్య దేవీ కత్తితో దాడి చేసింది. అదే కత్తితో భార్యపై భర్త పలుమార్లు దాడి చేసాడు. ఘటనలో భార్య దేవీ కి తీవ్ర గాయాలు అయ్యాయి. ఆమెను భువనగిరి ఏరియా హాస్పిటల్ తరలించారు, భర్త మహేష్ ఆత్మకూరు పోలీసు స్టేషన్ లో లొంగిపోయాడు.

## ఎమ్మెల్యే సామేలు దిష్టిబొమ్మ దగ్ధం

**సూర్యాపేట** తిరుమలగిరిలో ఎమ్మెల్యే సామేలు దిష్టిబొమ్మను బీజేపీ పార్టీ శ్రేణులు దగ్ధం చేసారు. బీజేపీ నియోజకవర్గ ఇంఛార్జ్ కడియం రామచంద్రయ్య ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో జరిగింది. ఎమ్మెల్యే మందుల సామేలు రాజీనామా చేయాలి... లేదా సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే పదవి నుండి సామేలును బర్తరఫ్ చేయాలి. బ్రాహ్మణులు, హిందువుల పట్ల ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని నినాదాలు చేసారు. చౌరస్తాలో ధర్నాకు దిగడంతో నలువైపులా కిలోమీటర్ల మేరకు వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు బీజేపీ నియోజకవర్గ ఇంఛార్జ్ కడియం రామచంద్రయ్యను అరెస్ట్ చేసారు.

## ఈ ఎన్నికల్లో అంతర్జాతీయ అంశాలే ప్రధానం

**తిరువనంతపురం,** కేరళ రాజకీయాలు ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన ఒరవడిని కలిగి ఉంటాయి. ఇక్కడి ఓటరు చైతన్యం దేశానికే ఆదర్శం. అయితే, ఈసారి జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం స్థానిక అంశాలే కాకుండా, అంతర్జాతీయ పరిణామాలు కూడా తీర్పును ప్రభావితం చేయబోతున్నాయి. ముఖ్యంగా కేరళ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే ప్రవాస కేరళీయుల స్థితిగతులు, పెరుగుతున్న వలస కార్మికుల ప్రభావంపై ఈసారి ప్రధాన పార్టీలైన ఎల్డీఎఫ్, యూడీఎ, బీజేపీ తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి.దశాబ్దాలుగా కేరళ అభివృద్ధిలో గల్ఫ్ దేశాల నుంచి వచ్చే నిధులు కీలక పాత్ర పోషించాయి. అయితే, ఇటీవలి కాలంలో గల్ఫ్ దేశాల్లో మారిన నిబంధనలు, అక్కడి స్వదేశీకరణ విధానాల వల్ల వేలాది మంది కేరళీయులు ఉపాధి కోల్పోయి స్వస్థలాలకు తిరిగి వస్తున్నారు. ఒకప్పుడు విదేశీ నగదుతో కళకళలాడిన గ్రామాలు ఇప్పుడు నిరుద్యోగంతో నిశ్శబ్దంగా మారుతున్నాయి. తిరిగి వచ్చిన ప్రవాసుల పునరావాసం కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు అరకొరగానే ఉన్నాయనే విమర్శలు బలంగా ఉన్నాయి. ఈ రిటర్న్ మలయాళీ వర్గం ఈసారి ఎన్నికల్లో ఎటు మొగ్గు చూపుతుందనేది అత్యంత ఆసక్తికరంగా మారింది. ఇప్పుడు దీనికి యుద్ధ ప్రభావం కూడా తోడైంది. మరోవైపు, కేరళలో కూలీల కొరతను భర్తీ చేసేందుకు పశ్చిమ బెంగాల్, బిహార్, అస్సాం వంటి రాష్ట్రాల నుంచి వస్తున్న వలస కార్మికులు ఇప్పుడు అక్కడి సమాజంలో అంతర్భాగమయ్యారు. వీరి సంఖ్య లక్షల్లో ఉండటంతో, వీరిని ఓటు బ్యాంకుగా మార్చుకునేందుకు రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. ఈ వలస కార్మికులకు సామాజిక భద్రత కల్పించే అంశంపై పార్టీల మధ్య పోటీ నెలకొంది. వీరి ప్రభావం ముఖ్యంగా ఎర్నాకుళం, పెరుంబావూర్ వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో ఫలితాలను తారుమారు చేసే అవకాశం ఉంది. కేరళలో మైనారిటీ ఓట్లు ఎప్పుడూ నిర్ణయాత్మకమే. అయితే, ఈసారి క్రైస్తవ ఓటు బ్యాంకులో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. గతంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్‌కు కంచుకోటగా ఉన్న ఈ వర్గం, ఇప్పుడు రబ్బర్ ధరల పతనం,మతపరమైన భద్రత' వంటి కారణాలతో ఎల్డీఎఫ్ వైపు , బీజేపీ వైపు చూస్తోంది. ముఖ్యంగా మధ్య కేరళలో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఇది యూడీఎఫ్ మనుగడకు సవాలుగా మారగా, పినరయి విజయన్ నాయకత్వంలోని ఎల్డీఎఫ్ దీనిని అవకాశంగా మలుచుకోవాలని చూస్తోంది.బీజేపీ ఈసారి కేరళలో తన ఉనికిని కేవలం ఓట్ల శాతానికే పరిమితం చేయకూడదని పట్టుదలతో ఉంది. మోదీ బ్రాండ్ ఇమేజ్, కేంద్ర పథకాల ప్రచారం ,సురేష్ గోపి వంటి సెలబ్రిటీ నేతల చరిష్మాను నమ్ముకుంది. హిందూ ఓట్ల ఏకీకరణతో పాటు, అసంతృప్త క్రైస్తవ వర్గాలను ఆకట్టుకోవడం ద్వారా త్రిముఖ పోటీని సృష్టించాలని యోచిస్తోంది. ఒకవేళ బీజేపీ కొన్ని కీలక స్థానాల్లో గణనీయమైన ఓట్లు సాధిస్తే, అది ఎల్డీఎఫ్, యూడీఎఫ్.. ఎవరి కొంప ముంచుతుందో చెప్పలేము.ఈసారి కేరళ ఎన్నికలు కేవలం లెఫ్ట్ వర్సెస్ రైట్ మధ్య పోరు మాత్రమే కాదు. ఇది వలస వెళ్ళిన వాడి ఆవేదనకు, వలస వచ్చిన వాడి భవిష్యత్తుకు , నిలదొక్కుకోవాలనుకుంటున్న రాజకీయ సిద్ధాంతాల మధ్య జరుగుతున్న యుద్ధంగా మారుతోంది.

## ప్రాణాలు తీసిన బైక్ ఇంజన్ పొగ

**తిరుపతి,** బైక్ ఇంజిన్ నుంచి వచ్చిన పొగ వల్ల నలుగురు చనిపోయిన ఘటన చాలా మందినిగ్ర్భాంతికి గురిచేసింది. సాధారణంగా బైక్ ఇంజిన్ నుంచి వచ్చే పొగ ప్రాణాలను తీస్తుందని ఎవరూ ఊహించరు. అయితే, మూసి ఉన్న గదుల్లో లేదా గాలి ఆడని ప్రదేశాల్లో వాహనాన్ని ఎక్కువ సేపు ఆన్ చేసి ఉంచినప్పుడు వెలువడే వాయువులను సైలెంట్ కిల్లర్స్ అని పిలుస్తారు. అదే నలుగురు ప్రాణాలను తీసింది.బైక్ లేదా ఏదైనా వాహన ఇంజిన్ పనిచేస్తున్నప్పుడు పెట్రోల్ అసంపూర్తిగా దహనం చెందడం వల్ల కార్బన్ మోనాక్సైడ్ అనే విషవాయువు వెలువడుతుంది. ఈ వాయువుకు రంగు, రుచి, వాసన ఉండవు. అందుకే గదిలో ఈ వాయువు నిండినట్లు కూడా ఎవరూ గుర్తించలేరు. కిటికీలు, తలుపులు మూసి ఉన్న ఇరుకైన ప్రదేశంలో బోర్ వేయించిన కొత్త బైక్ ఇంజిన్‌ను పరీక్షించే క్రమంలో దానిని ఎక్కువ సేపు ఆన్ చేసి ఉంచితే, గదిలోని ఆక్సిజన్ తగ్గిపోయి కార్బన్ మోనాక్సైడ్ స్థాయిలు వేగంగా పెరుగుతాయి.కార్బన్ మోనాక్సైడ్ ప్రాణాపాయకరంగా మారడానికి ప్రధాన కారణం అది మన రక్తంలోని హీమోగ్లోబిన్ తో జరిపే ప్రతిచర్య. సాధారణంగా హీమోగ్లోబిన్ ఆక్సిజన్‌ను మోసుకెళ్తుంది. కానీ ఆక్సిజన్ కంటే కార్బన్ మోనాక్సైడ్ హీమోగ్లోబిన్‌తో 200 నుండి 250 రెట్లు వేగంగా బంధాన్ని ఏర్పరుచుకుంటుంది. దీనివల్ల రక్తంలో కార్బాక్సీహీమోగ్లోబిన్ ఏర్పడుతుంది. ఫలితంగా రక్తానికి ఆక్సిజన్‌ను శరీర భాగాలకు చేరవేసే సామర్థ్యం నశిస్తుంది. దీనినే వైద్య పరిభాషలో కెమికల్ యాస్ఫిక్సియేషన్ అంటారు.

ఈ విషవాయువు పీల్చినప్పుడు మొదట తలనొప్పి, కళ్లు తిరగడం, వాంతులు రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అయితే నిద్రలో ఉన్నప్పుడు లేదా మద్యం మత్తులో ఉన్నప్పుడు ఈ వాయువు శరీరంలోకి చేరితే, బాధితులు అసలు గుర్తించే లోపే స్పృహ కోల్పోతారు. మెదడు , గుండెకు ఆక్సిజన్ అందకపోవడంతో నిమిషాల వ్యవధిలోనే మరణం సంభవిస్తుంది. పుంగనూరు ఘటనలో కూడా మూసి ఉన్న గదిలో ఇంజిన్ పొగ నిండిపోవడం వల్లే బాధితులు ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారు. ముఖ్యంగా బోర్ చేయించిన వాహనాల ఇంజిన్లు సెట్ అవ్వడానికి ఎక్కువ సేపు ఆన్ చేసి ఉంచుతారు, ఇలాంటప్పుడు తప్పనిసరిగా గాలి వెలుతురు ధారాళంగా ఉండే బహిరంగ ప్రదేశాల్లోనే వాహనాన్ని ఉంచాలి. ఇలాంటి ప్రాథమిక జాగ్రత్తలు పాటించకపోవడం వల్లే ఇలాంటి విషాదాలు జరుగుతుంటాయి.

## చిన్నారి మృతదేహంతో బంధువుల రాస్తారోకో

**విజయవాడ** బాపులపాడు మండలం వీరవల్లీ వద్ద సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మరణించిన మూడేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటన లో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బంధువులు , గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఘటన స్థలం వద్ద చిన్నారి మృతదేహాన్ని వుంచి ఆందోళన చేసారు. చిన్నారి మృతికి కారణమైన లారీ డ్రైవర్, ,లారీ యాజమాన్ని తక్షణమే అరెస్ట్ చేయాలని రోడ్డు పై బైఠాయించి రాస్తారోకో చేసారు.

# సువేంద్ర అక్కడి నుంచే పోటీ...

**కోల్ కత్తా,** త అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్ నుంచి బరిలో నిలిచిన పశ్చిమ్ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ.. తన మాజీ అనుచరుడు, బీజేపీ నేత సువేందు అధికారి చేతిలో ఓటమి పాలయ్యారు. ఈసారి కూడా దీదీని సువేందు ఢీకొట్టబోతున్నారు. బెంగాల్ ఎన్నికలకు 144 మంది అభ్యర్థుల తొలి జాబితాను బీజేపీ సోమవారం విడుదల చేయగా.... ప్రస్తుతం మమతా బెనర్జీ ప్రాతినిధ్యం వహిస్తున్న భవానీపూర్ నుంచి తమ అభ్యర్థిగా ప్రతిపక్ష నేత సువేందును ప్రకటించింది. నందిగ్రామ్ నుంచి కూడా సువేందే పోటీ చేయనున్నారు. అయితే, దీదీ ఎక్కడ నుంచి పోటీ చేస్తారనేది ఇంకా స్పష్టత లేదు. కానీ, భవానీపూర్ నుంచే మళ్లీ బరిలోకి దిగుతారనే ప్రచారం జరుగుతోంది. వరుసగా ఇదే నియోజకవర్గానికి మమతా మూడుసార్లు విజయం సాధించారు. పశ్చిమ్ బెంగాల్లో రెండు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న సంగతి తెలిసిందే.కమ్యూనిస్టుల కంచుకోటను బద్దలుకొట్టి 2011లో మమతా బెనర్జీ అధికారంలోకి రావడంలో 'నందిగ్రామ్' కీలక పాత్ర పోషించింది. నాటి కమ్యూనిస్ట్ ప్రభుత్వ చేపట్టిన భూసేకరణకు వ్యతిరేకంగా మమతా నాయకత్వంలో టీఎంసీ చేపట్టిన ఉద్యమంలో సువేందు అధికారి ఆమెకు తోడుగా ఉన్నారు. తర్వాత అక్కడ నుంచే అసెంబ్లీకి ఎన్నికయ్యారు. కానీ 2021లో మమతా బెనర్జీపై ఆయననే బీజేపీ ఆయుధంగా ప్రయోగించింది. పోటాపోటీగా ఎప్పుడూ వెనక్కి తగ్గని దీదీ.. నందిగ్రామ్ నుంచి బరిలోకి దిగారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ సీటులో 1956 ఓట్ల తేడాతో సువేందు గెలిచి, పైచేయి సాధించారు. నందిగ్రామ్ అధికారానికి అందగా నిలుస్తోందన్న విషయం.. ఆ మరుసటి ఏడాది జరిగిన సహకార సంస్థ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో స్పష్టమైంది.అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా తృణమూల్ కాంగ్రెస్ గెలిచి హ్యాట్రిక్ కొట్టినా.. నందిగ్రామ్‌లో దీదీని ఓటమి ఎదుర్కొన్నారు. దీంతో తన సొంత నియోజకవర్గం భవానీపూర్ నుంచి మళ్లీ పోటీచేసి 50 వేలకుపైగా ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు.గత ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి పేరుకు ముందు 'మాజీ' అనే పదాన్ని చేర్చాలని తాను కోరుకుంటున్నట్లు ప్రకటించిన అధికారి.. ఈసారి కూడా తాను పోటీచేయబోయే సీటు ఎంపిక ద్వారా ఒక స్పష్టమైన సందేశాన్ని పంపారు. "నందిగ్రామ్‌లో నేను ఆమెను ఓడించాను.. ఈసారి భవానీపూర్‌లో కూడా ఆమెను ఓడిస్తాను... 50,000 ఓట్ల తేడాతో ఆమెను మాజీ ముఖ్యమంత్రిగా మారుస్తాను" అని అధికారి పలు సందర్భాల్లో శపథం చేశారు.కాగా, ఇటీవల బెంగాల్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భారీగా ఓటర్లను తొలగించారు. దీదీ కంచుకోట అయిన భవానీపూర్.. రాష్ట్రంలో అత్యధికంగా ఓటర్లను తొలగించిన నియోజకవర్గాల్లో ఒకటి. ఈసీ గతవారం విడుదల చేసిన డేటా ప్రకారం నందిగ్రామ్ కంటే నాలుగు రెట్లు ఇక్కడ ఓట్లు తొలగించారు. భవానీపూర్‌లో మొత్తం 2,06,295 ఓట్లు ఉండగా 44,787 ఓట్లు... నందిగ్రామ్‌లో 2,78,211 ఓట్లు ఉండగా 10,599 ఓట్లను తొలగించారు. బెంగాల్ అసెంబ్లీకి రెండు దశల్లో ఏప్రిల్ 23, ఏప్రిల్ 29న పోలింగ్ జరగనుంది. మే 4న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడిస్తారు.

# నివురుగప్పిన నిప్పులా కాంగ్రెస్

**హైదరాబాద్,** తెలంగాణ కాంగ్రెస్ లో అసంతృప్తి అనేది బయటపడకుండా ఉంది. అయితే ఎన్నికల దగ్గర పడే సమయంలో అది మరింత బయటపడే అవకాశముందన్న సంకేతాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే అప్పర్ హ్యాండ్ గానే ఉంది. ఢిల్లీ హైకమాండ్ వద్ద కూడా ఆయనకు తిరుగులేదు. ఎన్ని ప్రచారాలు జరిగినప్పటికీ రేవంత్ రెడ్డి విషయంలో ఢిల్లీ నాయకత్వం చూసీ చూడనట్లు వ్యవహరిస్తుంది. ఇటీవల రాజ్యసభ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికపై కూడా సీనియర్ నేతల్లో అసంతృప్తి ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తుంది.కానీ అది బయట పదేంత మాత్రం లేదన్నది వాస్తవం. ఎందుకంటే రేవంత్ రెడ్డిని ఎదిరించి ఇప్పుడు సాధించేదేమీ ఉండదని అందరికీ తెలుసు. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ నేతలు ఇక పార్టీ నుంచి సర్దేసుకుంటున్నప్పటికీ, చాలా మంది అసంతృప్తి నేతలు తమకు భవిష్యత్ లోనూ పదవులు రావన్న ఆందోళనలో ఉన్నారు. రేవంత్ రెడ్డి ఒంటిచేత్తో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చారు. అందులో ఎలాంటి సందేహం లేదు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ ను పదేళ్ల పాటు ప్రజలు కాదన్నప్పటికీ రేవంత్ రెడ్డి వ్యూహాలు, అనుసరించిన విధానాలతోనే పార్టీ అధికారంలోకి వచ్చింది. అయినా రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నేతగా చూసేందుకు కొందరు ఇష్టపడకపోవడంతోనే ఈ సమస్య ఉందని చెబుతున్నారు.అయితే అది కాంగ్రెస్ పార్టీ. ప్రజాస్వామ్యం పాళ్లు చాలా ఎక్కువ. ప్రాంతీయ పార్టీలు, జాతీయ పార్టీ అయిన బీజేపీ తరహా లాంటిది కాదు. ఎవరి లాబీయింగ్ వారికి ఉంటుంది. ఢిల్లీ స్థాయిలో అందరికీ సంబంధాలున్నాయి. అయితే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు సీనియర్ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి లాంటి వాళ్లు కూడా సమయం కోసం వేచి చూస్తున్నారన్న ప్రచారం జోరుగా సాగుతుంది. అయితే సీనియర్ నేతలను కలుపుకుని వెళుతూనే తాను అనుకున్నది చేసుకుంటూ వెళుతుండటంతో ఇప్పటి వరకూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదని, అయితే ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ కాంగ్రెస్ నేతలు ఇక ఊరికే ఉండరని, చికాకు తెప్పించడం ఖాయమన్న కామెంట్స్ సొంత పార్టీ నేతల నుంచే వినిపిస్తున్నాయి. మరి పదేళ్ల పాటు అధికారం తమదేనంటున్న రేవంత్ రెడ్డి నేతలను ఎలా కంట్రోల్ లో పెడతారో చూడాలి.

## మూసీ ప్రక్షాళన...రంగంలోకి నాలుగో కృష్ణుడు

**హైదరాబాద్,** హైదరాబాద్ నగరంలో మూసీ నదికి ఒక విచిత్రమైన చరిత్ర ఉంది. అదేంటంటే.. ప్రతి ఎన్నికలకు ముందు మూసీ నది 'లండన్ థేమ్స్'లా మారిపోతుంది.. ఎన్నికలు అయిపోయాక మళ్లీ యధావిధిగా 'మురికి కూపం'గా ప్రమోషన్ పొందుతుంది. ఇప్పుడు రేవంత్ రెడ్డి గారి వంతు వచ్చింది. బాపూఘాట్ దగ్గర ఏకంగా గాంధీజీ విగ్రహాన్ని పెట్టేసి, మూసీని 'గాంధీ సరోవరం'గా మార్చేయాలని ప్లాన్ చేశారు. వింటేనే భలే ఉంది కదూ!కానీ అసలు సమస్య అంతా ఇక్కడే ఉంది. నదిని బాగు చేద్దామని రేవంత్ పీపీటీ ప్రెజెంటేషన్లు ఇస్తుంటే అవతలి వైపు విపక్షాలు 'సర్జికల్ స్ట్రైక్' అంటూ కత్తులు నూరుతున్నాయి.ప్రభుత్వం పక్కా ప్లాన్‌తో ఏడీబీ బ్యాంకు నుంచి అప్పు తెచ్చి, మూసీని సుందరీకరిస్తామని చెబుతుంటే.. విపక్షాలేమో "మా ఇల్లు కూల్చేస్తారా?" అంటూ ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. నిజానికి ఈ విల్లాలు, అపార్ట్‌మెంట్లు కట్టేసిన్నప్పుడు ఆ గూగుల్ మ్యాప్స్ అప్పట్లో ఎక్కడికి వెళ్లాయో ఎవరికీ అర్థం కావడం లేదు.మూసీ ప్రక్షాళన అనేది పాతకాలపు సీరియల్ లాంటిది. చంద్రబాబు సమయంలో "నందనవనం" పేరుతో కలలు కడితే.. అది వర్షానికి 'నీట' మునిగింది. వైఎస్ఆర్ హయాంలో "సేవ్ మూసీ" అంటూ రబ్బరు డ్యామ్ కడితే.. అది వరదకు కొట్టుకుపోయింది. కేసీఆర్ పాలనలో "రివర్ ఫ్రంట్" అని కార్పొరేషన్ పెట్టారు.. అది చివరికి రాజకీయ పునరావాస కేంద్రంగా మారింది. ఇప్పుడు రేవంత్ గారు "గాంధీ సరోవరం" అంటున్నారు. చరిత్ర పాఠాలు చదివితే.. "మూసీ ప్రక్షాళన" అంటేనే ఒక పెద్ద 'ప్రాజెక్టు అటకెక్కింపు' కార్యక్రమం అని అర్థమవుతోంది.అక్రమ కట్టడాల కూల్చివేత విషయంలో ప్రభుత్వం కఠినంగా ఉంటే, పేదవాడి కన్నీరు.. అదే పెద్ద పెద్ద విల్లాల దగ్గర కొచ్చేసరికి 'సర్దుబాటు' రాజకీయాలు.. ఇదే కదా మన హైదరాబాద్ స్పెషాలిటీ! సర్కార్ ఏమో లండన్ కలను చూపిస్తుంటే.. నిర్వాసితులు మాత్రం 'మా గూడు మాకుండనివ్వండి' అని ప్రాధేయపడుతున్నారు.చివరికి మూసీ మారుతుందో లేదో తెలియదు కానీ, రాజకీయ పార్టీలకు మాత్రం మూసీ ఒక 'శాశ్వత ఆదాయ వనరు'గా 'నిరంతర విమర్శనాస్త్రం'గా మారిపోయింది. మొత్తానికి మూసీకి శుద్ధి ఎప్పుడు జరుగుతుందో కానీ, రాజకీయ నాయకులకు మాత్రం ఈ ఇష్యూతో ఎప్పుడూ 'పబ్లిసిటీ' పుష్కలంగా దొరుకుతోంది.

## పూరి గుడిసెలు లేదా టెంట్ తరహా తాత్కాలిక ఆవాసాలు ఉన్న వారికే ఇందిరమ్మ ఇండ్లు

**హైదరాబాద్,** : ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) మార్గదర్శకాల ప్రకారం రాష్ట్రంలో పూరి గుడిసెలు ఉన్నవారు లేదా టెంట్ తరహా తాత్కాలిక ఆవాసాలు ఏర్పాటుచేసుకున్న వారికి మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు కేటాయించేలా రాష్ట్ర సర్కార్ సన్నాహాలు చేస్తున్నది. లేకపోతే కేంద్రం నుంచి నిధులు వచ్చే అవకాశం లేనందున పక్కా ఇల్లు లేనివారిని గుర్తించేందుకు సర్వే చేపట్టాలని నిర్ణయించింది. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు 3.5లక్షల ఇండ్లు కేటాయించగా, అందులో 2.5లక్షల ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు రాష్ట్రానికి 1.3లక్షల పట్టణ ప్రాంత ఇండ్లు సహా మొత్తం 4.5లక్షల ఇండ్లు మంజూరు చేసింది.

ఇందులో భాగంగా కేంద్రం పట్టణ ఇండ్లకు రూ.1.5లక్షలు, గ్రామీణ ఇండ్లకు రూ.72వేల చొప్పున మంజూరు చేస్తుంది. కేంద్ర మార్గదర్శకాల్లో ముఖ్యంగా పక్కా ఇల్లు లేనివారు, ఇంట్లో రిఫ్రిజిరేటర్, కారు, మోటరైజ్డ్ వ్యవసాయ యంత్రాలు, రూ.50వేల పరిమితి వరకు ఉన్న కిసాన్ క్రెడిట్ కార్డు(కేసీసీ), ఇంట్లో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లేక ఆదాయపు పన్ను చెల్లించేవారు ఉంటే పీఎంఏవై పథకం కింద ఇల్లు పొందేందుకు అనర్హులు.ఈ క్రమంలో మంజూరైన ఇండ్లకు నిధులు సక్రమంగా విడుదల కావాలంటే పీఎంఏవై మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్మించి ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపిన లబ్ధిదారుల జాబితాలో చాలావరకు పేర్లను కేంద్రం తొలగించడంతో రాష్ట్ర సర్కార్ పునరాలోచనలో పడింది. ఇందులో భాగంగా ఇప్పటికే ఇండ్లు నిర్మాణంలో ఉన్న లబ్ధిదారుల ఆర్థిక స్థితిగతులను తెలుసుకోవడంతో పాటు కొత్తగా లబ్ధిదారులను గుర్తించేందుకు సర్వే చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా పూర్తిగా నిరుపేదలను మాత్రమే గుర్తించి ఇండ్లు మంజూరు చేయాలని ప్రభుత్వం గృహ నిర్మాణ శాఖను ఆదేశించింది.

# ప్రైవేటు దవాఖానాలపై సర్కార్ నిఘా

**వరంగల్,** తెలంగాణలో ప్రైవేటు ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత పారదర్శకం చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం కింద ప్రతి హాస్పిటల్ తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలి. సిద్దిపేట, హనుమకొండ జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన ఈ విధానం ద్వారా ఫేక్ డాక్టర్లు, అనధికారిక క్లినిక్‌లకు అడ్డుకట్ట వేస్తూ హాస్పిటల్ పూర్తి వివరాలను ప్రజలకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనున్నారు.తెలంగాణలో నకిలీ వైద్యులు ఎక్కువైపోయారు. ఒక్క గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే దాదాపు 250 నకిలీ హాస్పిటల్స్ ఉన్నట్లు తేలింది. అర్హత లేకున్నా డాక్టర్లుగా చెలామణి అవుతూ.. కాసుల కోసం హాస్పిటల్స్ ఓపెన్ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నట్లు వైద్యారోగ్యశాఖ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో రేవంత్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నకిలీ వైద్యానికి చెక్ పెడుతూ.. ఆన్‌లైన్‌లోనే ఆసుపత్రుల రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేసింది. ప్రైవేటు హాస్పిటల్ నడపాలంటే తప్పనిసరిగా అవి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని అమలు చేయాల్సి ఉంటుంది.ఇందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం జిల్లా వైద్యాధికారి ఆఫీసుకు వెళ్లాలనే నిబంధన ఉంది. ఈ విధానం వల్ల పలు ప్రైవేటు హాస్పిటల్ యాజమాన్యాలు రిజిస్ట్రేషన్ చేసుకోకుండానే అనధికారికంగా ఆసుపత్రులను నడిపిస్తున్నారు. అటువంటి ఘటనలు అనేకం వెలుగులోకి వచ్చాయి. రాష్ట్రంలో ఇటీవల పెద్ద సంఖ్యలో ఏర్పాటవుతున్న ఫిజియోథెరపీ కేంద్రాలు కూడా సీఈఏను పట్టించుకోవడంలేదని తెలిసింది. ఇక నుంచి ప్రతి ఆసుపత్రి తప్పనిసరిగా సర్కారు వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలనే లక్ష్యంతో వైద్య ఆరోగ్య శాఖ సీఈఏ కోసం ప్రత్యేకంగా ఆన్‌లైన్ పోర్టల్‌ను తీసుకొచ్చింది. సిద్దిపేట, హనుమకొండ జిల్లాల్లో తాజాగా పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు.ఆసుపత్రి రిజిస్ట్రేషన్ కోసం కాలుష్య నియంత్రణ మండలి ధ్రువీకరణ పత్రం, బయోమెడికల్ వ్యర్థాల వివరాలు, ఫైర్ డిపార్ట్‌మెంట్ అనుమతులు, పనిచేసే డాక్టర్లు, నర్సులు.. వారి అర్హత, అందిస్తున్న సేవలు.. వైద్య సేవల ధరలు, పడకల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ముందుగానే సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేశాక జిల్లా వైద్యాధికారి పరిశీలించి కలెక్టర్‌కు ఆ వివరాలను ఆన్‌లైన్‌లో పంపిస్తారు. కలెక్టర్ పరిశీలించి అనుమతికి అంగీకరిస్తేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది.నల్గొండ, ప్రస్తుతం కొన్ని అలోపతి హాస్పిటళ్లలో నిబంధనలకు విరుద్ధంగా హోమియో డాక్టర్లు కూడా పనిచేస్తున్నారు. ఆర్ఎంపీలు అర్హత లేకున్నా హాస్పిటల్స్ నడిపిస్తున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆన్‌లైన్ కావడం వల్ల ఇకపై ఇలాంటి వాటికి కూడా అడ్డుకట్ట పడుతుందని అధికారులు అంటున్నారు. త్వరలోనే ప్రజలు కూడా ప్రైవేటు ఆసుపత్రులకు సంబంధించి సకల సమాచారం ఆన్‌లైన్‌లోనే చూసేలా పోర్టల్ అభివృద్ధి జరుగుతోందని చెబుతున్నారు.

## 25న గులాబీ కండువా కప్పుకోనున్న జీవన్ రెడ్డి !

**కరీంనగర్,** సుదీర్ఘ కాలంగా కాంగ్రెస్ పార్టీలో ఉన్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి.. ఇక పార్టీ మారేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. 4 దశాబ్దాలుగా హస్తం పార్టీలో ఉన్న జీవన్ రెడ్డి.. ఇక చేతికి గుడ్‌బై చెప్పి.. కారు ఎక్కనున్నట్లు సమాచారం. ఈనెల 25న గులాబీ కండువా కప్పుకునేందుకు జీవన్ రెడ్డి రెడీ అయినట్లు సంబంధిత వర్గాల నుంచి గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు జీవన్ రెడ్డి ఇంటి వద్ద కాంగ్రెస్ ఫ్లెక్సీలు చించేయడం ఈ ఊహాగానాలకు బలాన్ని చేకూరుస్తోంది. 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఉన్న మాజీ మంత్రి, హస్తం పార్టీ సీనియర్ నేత టీ జీవన్ రెడ్డి .. గత కొన్నిరోజులుగా జరుగుతున్న పరిణామాలతో తీవ్ర మనోవేదనకు గురైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీలో తీవ్ర అవమానాలు ఎదురవుతున్నాయని.. ఆయన బహిరంగంగా మీడియా ముందే వెల్లడించడం గమనార్హం. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్.. గతంలో బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచి.. కాంగ్రెస్ పార్టీలో చేరగా.. అప్పటి నుంచి జగిత్యాలలో వర్గపోరు మొదలైంది.అది కాస్తా ఇటీవలి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా తారస్థాయికి చేరుకుంది. తమ వర్గం వారికి మున్సిపల్ ఎన్నికల్లో టికెట్లు ఇవ్వలేదని తీవ్ర అసహనం వ్యక్తం చేసిన జీవన్ రెడ్డి.. తమ అనుచరులను ఇండిపెండెంట్లుగా పోటీ చేయించి.. గెలిపించుకుని తన సత్తా ఏంటో హైకమాండ్‌కు తెలియజేశారు. అయినప్పటికీ తనకు సరైన గుర్తింపు లేకపోవడంతో పార్టీని వీడాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీని వీడుతున్నట్లు తన అనుచరులతో జీవన్‌రెడ్డి చెప్పినట్లు సమాచారం. ఈ నెల 25వ తేదీన బీఆర్ఎస్ పార్టీలో జీవన్ రెడ్డి చేరనున్నట్లు తెలుస్తోంది. గత 4 దశాబ్దాలుగా జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీకి సేవలందించిన జీవన్‌రెడ్డి.. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలుగా గెలిచారు. అయితే డాక్టర్ సంజయ్ కుమార్ రాకతో కాంగ్రెస్ పార్టీలో తనకు ప్రాధాన్యం లేనందునే పార్టీని వీడాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఈనెల 25వ తేదీన జగిత్యాలలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసి.. గులాబీ కండువా కప్పుకోనున్నట్లు తెలుస్తోంది. జగిత్యాలలో ఉన్న జీవన్ రెడ్డి ఇంటి వద్ద ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రోటోకాల్ ఫ్లెక్సీలను.. ఆయన అనుచరులు చించేయడం, తొలగించడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆయన నివాసం ముందు, లోపల ఉన్న కాంగ్రెస్ పార్టీ జెండాలు, అగ్రనాయకుల ఫోటోలతో కూడిన బ్యానర్లను కార్యకర్తలు తీసేశారు. కేవలం జీవన్ రెడ్డి మాత్రమే ఉన్న ఫోటోలు, ఫ్లెక్సీలను ఉంచుతున్నారు. తాను పార్టీకి ఎంత చేస్తున్నా దాన్ని అధిష్టానం గుర్తించకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన జీవన్ రెడ్డి.. ఇక కాంగ్రెస్ పార్టీతో బంధం తెంచుకోవడమే మేలు అని భావిస్తున్నట్లు తెలుస్తోంది. తన అనుచరులతో సుదీర్ఘంగా మంతనాలు జరిపిన తర్వాతే.. పార్టీ మార్పుపై జీవన్ రెడ్డి నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

**40 ఏళ్ల అనుబంధం** తెలంగాణ రాజకీయాల్లో అత్యంత సీనియర్ నేతగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో చెరగని ముద్రవేసుకున్న మాజీ మంత్రి టీ. జీవన్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. గత నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి వెన్నెముకలా నిలిచిన ఆయన, ఇప్పుడు ఆ పార్టీకి చేయి ఇచ్చి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోవడానికి సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఈ పరిణామం జగిత్యాల జిల్లాలోనే కాకుండా ఉత్తర తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. టీ. జీవన్ రెడ్డి అంటేనే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటేనే జీవన్ రెడ్డి అనే రీతిలో జగిత్యాల నియోజకవర్గంలో రాజకీయం సాగింది. అయితే, గత కొంత కాలంగా పార్టీ అంతర్గత పరిణామాలు ఆయనను తీవ్రంగా కలిచి వేస్తున్నాయి. ముఖ్యంగా రెండేళ్ల క్రితం బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిన ప్రస్తుత జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌తో జీవన్ రెడ్డికి పొసగడం లేదు. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు జెండా మోసిన తనకు కాకుండా, పక్క పార్టీ నుంచి వచ్చిన వారికి అధిష్ఠానం ప్రాధాన్యత ఇవ్వడంపై ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. జగిత్యాల మున్సిపల్ ఎన్నికల సమయంలో టికెట్ల కేటాయింపు నుంచి చైర్‌పర్సన్ పదవి వరకు అన్ని నిర్ణయాల్లోనూ సంజయ్ కుమార్ వర్గానికి పెద్ద పీట వేశారని, దీని వల్ల జీవన్ రెడ్డికి పార్టీలో ప్రాధాన్య తగ్గుతూ వచ్చిందని ఆయన అనుచరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తను కాదని సంజయ్ కుమార్‌కు నియోజకవర్గ పగ్గాలు అప్పగించడం, స్థానిక నిర్ణయాల్లో తన ప్రమేయం లేకుండా పోవడం ఆయనను తీవ్రంగా బాధించింది. తనకు, తనను నమ్ముకున్న అనుచరులకు పార్టీలో కనీస గౌరవం, ప్రాధాన్యత దక్కడం లేదని జీవన్ రెడ్డి భావిస్తున్నారు. సీనియర్ నేతా తన సలహాలను పక్కనపెట్టి, కొత్తగా వచ్చిన వారికి ప్రాముఖ్యత ఇవ్వడం ఆయనకు మింగుడుపడటం లేదు. ఈ క్రమంలోనే ఆయన తన సన్నిహితులు, ముఖ్య అనుచరులతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. పార్టీలో మనకు గుర్తింపు లేనప్పుడు ఇక్కడ కొనసాగడం కంటే ప్రత్యామ్నాయం చూసుకోవడమే ఉత్తమం అనే అభిప్రాయానికి ఆయన వచ్చినట్టు సమాచారం. సోషల్ మీడియా ఖాతాల నుంచి కాంగ్రెస్ పేరును తొలగించడం, తన అనుచరుల సోషల్ మీడియా పోస్టులు పార్టీ మార్పును ధృవీకరిస్తున్నట్టు కనిపిస్తున్నాయి. అయినప్పటికీ బహిరంగంగా మాత్రం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు అని ఆయన కొంత సమయం తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, ఈ నెల 25న జగిత్యాలలో ఒక భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయాలని జీవన్ రెడ్డి నిర్ణయించుకున్నారు. ఈ వేదికపైనే ఆయన తన భవిష్యత్ కార్యాచరణ ప్రకటించి, వేలాది మంది అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్‌తో టచ్‌లో ఉన్నారని సమాచారం. పార్టీలో ఆయనకు సముచిత స్థానం, తగిన గౌరవం ఇస్తామని బీఆర్ఎస్ అధిష్ఠానం నుంచి గట్టిగా హామీ లభించినట్టు తెలుస్తోంది. జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేత పార్టీని వీడటం కాంగ్రెస్‌కు పెద్ద షాక్ అని చెప్పవచ్చు. ముఖ్యంగా జగిత్యాల నియోజకవర్గంలో ఆయనకు పటిష్టమైన క్యాడర్ ఉంది. ఆయన నిర్ణయం వల్ల కాంగ్రెస్ బలం తగ్గే అవకాశం ఉండగా, బీఆర్ఎస్‌కు ఇది ఉత్తర తెలంగాణలో పెద్ద బూస్ట్‌గా మారనుంది. జగిత్యాలలో బీఆర్ఎస్ బలం మళ్లీ పుంజుకోవడానికి జీవన్ రెడ్డి రాక ఒక వరంలా మారుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఛాతిలో గన్‌తో కాల్చుకుని వ్యక్తి మృతి ..

# ఢిల్లీ వీడియో వైరల్

**న్యూఢిల్లీ** : ఓ ఫ్రెండ్ వీడియో రికార్డ్ చేస్తుండగానే.. ఢిల్లీలోని ఓ వ్యక్తి గన్‌తో తన ఛాతిలో కాల్చుకున్నాడు. ప్రస్తుతం ఈ ఘటనకు చెందిన వీడియో వైరల్ అవుతోంది. వీడియో తీస్తున్న వ్యక్తికి.. తన మిత్రుడు ఏం చేస్తున్నాడో తెలియకుండా ఆ ఘటన జరిగిపోయింది. ఒళ్లు జలదరించే రీతిలో ఉన్న వీడియోలో.. ఓ వ్యక్తి పిస్తోల్‌లోని మ్యాగ్జిన్ లోడ్ చేశాడు. ఆ తర్వాత ఆ వెపన్‌ను తన ఛాతిలో పెట్టుకుని ట్రిగ్గర్ నొక్కాడు. మ్యాగ్జిన్‌లోకి ఎలా బుల్లెట్ పెట్టారో వీడియో తీస్తున్న వ్యక్తి చెప్పాడు. బటన్ క్లిక్ చేస్తే అది లోపలికి వెళ్తుందని పేర్కొన్నాడు. చూడటానికి ఫిట్‌గా ఉన్న వ్యక్తి.. సైలెంట్‌గా గన్ తీసి తన ఛాతిలో కాల్చుకునే ప్రయత్నం చేస్తాడు.ఆ సమయంలో వీడియో తీస్తున్న వ్యక్తి ఫైరింగ్ చేయవద్దు అంటాడు. కానీ కొన్ని క్షణాల తర్వాత ఆ వ్యక్తి గన్‌ను ఛాతిలో ఎడమవైపు పెట్టుకుని కెమెరాకు స్మైల్ ఇస్తూ ట్రిగ్గర్‌ను సడెన్‌గా నొక్కేస్తాడు. అతని శరీరం నుంచి రక్తం చిందే మూమెంట్ కూడా వీడియోకు చిక్కింది.గన్‌తో కాల్చుకున్న వ్యక్తిని పవన్‌గా గుర్తించారు. న్యూ అశోక్ నగర్‌లో ఈ ఘటన జరిగింది. ఆస్పత్రికి తీసుకెళ్లగా ఆ వ్యక్తి మరణించినట్లు తేల్చారు. వీడియోలో ఉన్న పిస్తోల్‌కు లైసెన్స్ ఉంది. ఆ వీడియో తీస్తున్న వ్యక్తిదే ఆ పిస్తోల్. ఈ ఘటనకు చెందిన దర్యాప్తు చేపడుతున్నారు.

# సంపాదకీయం

## పెట్రోల్, డీజిల్, ఎరువులపై

# యుద్ధ ప్రభావం

యుద్ధాల్లో స్పష్టమైన విజేతలు ఉండటం చాలా అరుదు. సామాన్య ప్రజలే తరచూ భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి ఉంటుంది.ప్రపంచ ఇంధన మార్కెట్లు, సరఫరా గొలుసులు అస్తవ్యస్థంగా మారడంతో, కొన్ని దేశాలు తీవ్ర ఆర్థిక పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తోంది.అయితే ఇంతటి అనిశ్చితిలోనూ కొన్ని దేశాలు సరికొత్త వ్యూహాత్మక అవకాశాల కోసం చూస్తున్నాయి.ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయెల్ యుద్ధం ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా ఆ ప్రాంతంలో ప్రతికూల పరిణామాలను కలిగిస్తోంది.గల్ఫ్ దేశాలను అస్థిరపరిచింది. మధ్య ప్రాచ్యంలోని వేలాది మంది ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో తమ ఇళ్లను విడిచి బయటికి వెళ్లిపోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.చమురు ధరల పెరుగుదల, గల్ఫ్‌లో హార్ముజ్ జలసంధి వద్ద సముద్ర రవాణాకు కలుగుతున్న అంతరాయం వ్యాపారులకు, వినియోగదారులకు మరింత ఖర్చును పెంచుతోంది.ఇరాన్ రష్యాకు కీలకమైన మిత్రదేశం. అత్యంత ముఖ్యమైన సైనిక భాగస్వామి. సిరియాలో బషర్ అల్-అసద్ ప్రభుత్వాన్ని కుప్పకూల్చడం, వెనెజ్వెలాలో నికోలస్ మదురోను అమెరికా నిర్బంధించిన తర్వాత.. మాస్కోకు దౌత్యపరంగా ఎదురైన మరో ఎదురుదెబ్బ ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో మరణించడం.అయితే, మధ్య ప్రాచ్యంలో నెలకొన్న సంక్షోభం యుక్రెయిన్‌తో రష్యా తలపడుతోన్న యుద్ధానికి ప్రయోజనకరంగా మారవచ్చు. ఎందుకంటే, అమెరికా తన సైనిక బలగాలను మధ్య ప్రాచ్య సంక్షోభం వైపు మళ్లించవచ్చు." పేట్రియాట్ క్షిపణులు, ఇంటర్‌సెప్టార్లు తగ్గిపోవడం రష్యాకు ప్రయోజనకరంగా మారుతుంది. దీనివల్ల యుక్రెయిన్‌కు అందే ఆయుధాల సంఖ్య తగ్గిపోతుంది" అని సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ స్టడీస్‌కు చెందిన పారిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పొలిటికల్ స్టడీస్‌లోని అసిస్టెంట్ ప్రొఫెసర్ నికోల్ గ్రాజేవ్‌స్కీ పర్షియన్‌కు చెప్పారు.తెహ్రాన్‌కు షాహెద్ డ్రోన్ల అవసరం పెరిగినందువల్ల యుక్రెయిన్‌లో మాస్కో సామర్థ్యాలపై ఎలాంటి ప్రభావాన్ని చూపకపోవచ్చని నిపుణులు అంటున్నారు."యుక్రెయిన్‌తో యుద్ధం మొదలైనప్పుడు ఒక నిర్దిష్ట కాలం పాటు రక్షణ సహకారాల్లో భాగంగా రష్యా ఇరాన్‌పై ఆధారపడింది. అప్పుడు ఇరాన్ షాహెద్ డ్రోన్లను అందించింది. ముఖ్యంగా 2022-23ల్లో వీటి ప్రొడక్షన్ టెక్నాలజీని, ఈ డ్రోన్ల లైసెన్స్‌లను రష్యాకు అందించింది" అని అమెరికాలోని సెంటర్ ఫర్ నాన్-ప్రొలిఫరేషన్ స్టడీస్‌కు చెందిన యురేసియా డైరెక్టర్ హన్నా నోట్ తెలిపారు.'ఇప్పుడు యుక్రెయిన్‌లో యుద్ధం కొనసాగించడానికి రష్యాకు ఇరాన్ మద్దతు అవసరం లేని దశలో ఉంది. రష్యా సొంతంగా షాహెద్ డ్రోన్లను ఉత్పత్తి చేసుకోగలదు" అని తెలిపారు.ఇదే సమయంలో చమురు, గ్యాస్ సరఫరాలకు అత్యంత కీలక మార్గమైన హార్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో చమురు ధరలు పెరిగాయి. ఇది యుక్రెయిన్ యుద్ధంతో తీవ్ర ఒత్తిడికి గురైన రష్యాకు కొంత ఆర్థిక ఉపశమనం కలిగిస్తుంది.రష్యా బడ్జెట్ ఎక్కువగా ఆ దేశ చమురు ఎగుమతులపైనే ఆధారపడింది. అప్పట్లో బ్యారల్ చమురు ధర 59 డాలర్లు ఉండేది. ప్రస్తుతం ముడి చమురు ధర గణనీయంగా పెరిగింది. ఒకానొక సమయంలో బ్యారల్ సుమారు 120 డాలర్లకు ఎగిసింది.గల్ఫ్‌లోని ప్రముఖ చమురు ఉత్పత్తిదారులు ఉత్పత్తిని తగ్గించడంతో.. ప్రస్తుతం చైనా, భారత్ వంటి ముఖ్యమైన మార్కెట్లకు రష్యా మరింత ఎక్కువగా ఎగుమతి చేసే అవకాశం ఉంది."గతంలో రష్యా నుంచి చమురు కొనుగోలు చేయకుండా అమెరికా భారత్‌ను అడ్డుకుంది. కానీ, ప్రస్తుతం సంక్షోభంతో భారత్‌కు కాస్త ఉపశమనాన్ని కల్పిస్తూ.. మళ్లీ రష్యా చమురు కొనుగోలుకు అనుమతిచ్చింది. కనీసం వచ్చే నెల వరకు ఈ కొనుగోళ్లు కొనసాగవచ్చు ' అని గ్లోబల్ ఎనర్జీ, కమోడిటీ మార్కెట్ ఇంటెలిజెన్స్ కంపెనీ ఆర్గస్ చీఫ్ ఎకనామిస్ట్ డేవిడ్ ఫైఫె చెప్పారు.ఈ సమస్యల నుంచి కొంత బయటపడేందుకు రష్యా చమురుపై ఆంక్షలను సడలించాలని ఇప్పటికే చర్చలు జరుగుతున్నాయి.ఇరాన్ యుద్ధం వల్ల చైనాపై పడే ప్రభావం ఏ మేర ఉంటుందో ఇంకా చూడాల్సి ఉంది.చైనా ముడిచమురు దిగుమతుల్లో కేవలం 12 శాతం మాత్రమే ఇరాన్ నుంచి వస్తుందని సెంటర్ ఆన్ గ్లోబల్ ఎనర్జీ పాలసీ తెలిపింది.పైగా, చైనాలో కొన్ని నెలలకు సరిపడా చమురు సరఫరాలున్నాయి. ఆ తర్వాత తేలికగా రష్యా సాయాన్ని కూడా చైనా కోరుతుండొచ్చు.అయితే యుద్ధం వల్ల, చైనా "ఎగుమతుల ఆధారిత పరిశ్రమల రంగం" ప్రభావితం చెందవచ్చని ఫైఫె తెలిపారు.ప్రాపర్టీ ధరలు పడిపోవడం, దేశీయ వ్యయం తగ్గిపోవడంతో సతమతమవుతున్న చైనా ఆర్థిక వ్యవస్థకు చోదకశక్తిగా పనిచేసేది, ఆ దేశ జీడీపీలో 20శాతం వాటా ఉన్న ఎగుమతులే.హార్ముజ్ జలసంధిలో సముద్ర రవాణాకు నెలకొన్న అంతరాయం చైనాకు అంత పెద్ద సమస్య కాకపోవచ్చు. కానీ, చైనా ఉత్పత్తులు పశ్చిమానికి వెళ్లేందుకు అట్లాంటిక్ చేరుకోవడం క్లిష్టంగా మారవచ్చు.మరోవైపు, ఆసియా, యూరప్, ఆఫ్రికాలను కలిపే అరేబియన్ ద్వీపకల్పంలోని బాబ్ ఎల్-మాండెబ్ జలసంధిలో కూడా ఇరాన్ అండదండలున్న హౌతీలు దాడులు చేస్తున్నారు." ఇరాన్‌పై యుద్ధంలో చైనాకు దౌత్య అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. అమెరికాకు సమతూకంగా తనను తాను నిలబెట్టుకునేందుకు ఇది ప్రయత్నిస్తుంది" అని యూకే రాయల్ యునైటెడ్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ఫిలిప్ షెట్లర్ జోన్స్ చెప్పారు.మధ్య ప్రాచ్యంలోని చమురు, గ్యాస్‌పై ఎక్కువగా ఆధారపడ్డ ఆగ్నేయాసియా దేశాలు ఈ యుద్ధంతో ఎక్కువగా ప్రభావితమవుతాయి.కొన్ని ఇప్పటికే కఠినమైన చర్యలు తీసుకోవడం ప్రారంభించాయి. వీలైనంత త్వరగా ఆర్థిక ప్రభావాన్ని తగ్గించుకోవాలని చూస్తున్నాయి.వియత్నాంలో ఈ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి డీజిల్ ధర 60 శాతం పెరిగింది. వీలైతే ప్రతి ఒక్కరూ ఇళ్ల నుంచే పనిచేయాలని ప్రభుత్వం ఆదేశిస్తోంది.మధ్య ప్రాచ్యం నుంచి ముడిచమురు దిగుమతులపైనే 95 శాతం ఆధారపడ్డ ఫిలిప్పీన్స్‌లో ఎమర్జెన్సీ సేవల్లో పనిచేసే వారు మినహాయించి ప్రభుత్వ రంగ ఉద్యోగులు ప్రస్తుతం వారానికి నాలుగు రోజులే పనిచేస్తున్నారు.పాకిస్తాన్‌లో కూడా ఇదే రకమైన ఆంక్షలను ప్రవేశపెట్టారు. వీలైనప్పుడల్లా వర్క్ ఫ్రమ్ హోమ్ ఆదేశాలను జారీ చేస్తున్నారు. యూనివర్సిటీ తరగతులన్నీ ఆన్‌లైన్‌లోకి మారాయి.యుద్ధభయంతో భారీ కొనుగోళ్ల కారణంగా బంగ్లాదేశ్ ప్రభుత్వం ఇబ్బంది పడుతోంది. పెట్రోల్ బంకుల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. దీంతో, కార్లకు రోజుకు 10 లీటర్లు, మోటార్‌సైకిళ్లకు కేవలం రెండు లీటర్లు మాత్రమే ఇచ్చేలా పలు నిర్ణయాలను ప్రకటించింది.కానీ, యుద్ధం పర్యవసనాలు ఇంధన కొరతలకు మించి ఉండనున్నాయి.ప్రపంచవ్యాప్తంగా రైతులు తమ పంటల కోసం ఎరువులపై ఆధారపడ్డారు. ఈ ఎరువుల రవాణాలో అంతరాయాలు ఏర్పడితే, ప్రపంచవ్యాప్తంగా ఆహార భద్రతకు ప్రమాదం వాటిల్లనుంది." ప్రపంచ యూరియాలో 30 శాతం హార్ముజ్ జలసంధి మీదుగానే వస్తుంది. పెట్రో కెమికల్స్ నుంచి యూరియా వస్తుంది. ముడి చమురును శుద్ధి చేయడం ద్వారా పెట్రోకెమికల్స్ తయారవుతుంది.

ప్రపంచ మార్కెట్ల నుంచి 30 శాతం యూరియాను తీసివేస్తే, ప్రపంచ ఆహార భద్రతపై తీవ్రమైన ప్రభావం చూపనుంది" థింక్ ట్యాంక్ చాథమ్ హౌస్ మిడిల్ ఈస్ట్ నిపుణులు నీల్ క్విలియం తెలిపారు.ప్రపంచంలో అతిపెద్ద గ్యాస్ ఎగుమతిదారుల్లో ఒకటైన, ఎరువుల కోసం యూరియాను ఉత్పత్తి చేసే ప్రధాన సంస్థల్లో ఒకటి ఖతార్ ఇంధన స్థావరాలపై దాడులు జరిగాయి. ఈ దాడులతో కంపెనీలు తమ ఉత్పత్తి, డెలివరీలను తాత్కాలికంగా నిలిపివేసేలా అత్యవసర చర్యలను ప్రకటించాల్సి వచ్చింది."ఆహార భద్రత , ద్రవ్యోల్బణంపై ప్రభావాన్ని మీరు చూడొచ్చు" అని క్విలియం తెలిపారు."ఈ ప్రభావం ఏ మేర ఉంటుందో ఇంకా లెక్కించలేదు. కానీ, పంటలకు ఇబ్బందులు ఎదురైతే, ఎరువుల కోసం రైతులు ఇబ్బంది పడితే మనం దీర్ఘకాలిక ప్రభావాన్ని చూడాల్సి రావచ్చు" అన్నారు.






బాలీవుడ్

# ‘రామాయణ’లో కుంభకర్ణుడిగా ‘పంచాయత్’ నటుడు!

బాలీవుడ్ దర్శకుడు నితేష్ తివారీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ‘రామాయణ’ చిత్రానికి సంబంధించి ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ వెలువడింది. ప్రముఖ వెబ్ సిరీస్ ‘పంచాయత్’లో ప్రహ్లాద్ చా పాత్రతో ఫేమస్ అయిన నటుడు ఫైసల్ మాలిక్ ఈ చిత్రంలో కుంభకర్ణుడి పాత్రను పోషించబోతున్నట్లు తెలుస్తుంది. గతంలో ఈ పాత్ర కోసం బాబీ డియోల్ పేరు వినిపించినప్పటికీ, ఫైసల్ మాలిక్ యొక్క భారీ కాయం, సహజ సిద్ధమైన ఆహార్యం ఈ పాత్రకు అతికినట్లు సరిపోతాయని భావించిన చిత్రబృందం ఆయనను ఖరారు చేసింది. ఇప్పటికే ఫైసల్ మాలిక్ ముంబైలో తన మొదటి షెడ్యూల్ షూటింగ్‌ను కూడా పూర్తి చేసినట్లు సమాచారం. రావణుడిగా నటిస్తున్న కన్నడ స్టార్ యష్‌తో కలిసి ఆయన కీలక సన్నివేశాలలో నటించారు. ఈ సినిమాలో కుంభకర్ణుడి పాత్రను అత్యంత భారీగా, విజువల్ వండర్‌గా చూపించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. హాలీవుడ్ చిత్రం ‘అవతార్’ తరహాలో అత్యాధునిక గ్రాఫిక్స్ (ఎఖీశ) సహాయంతో ఈ పాత్రను డిజైన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం అంతర్జాతీయ యాక్షన్ మరియు విజువల్ ఎఫెక్ట్స్ బృందం పనిచేస్తోంది. రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, సన్నీ డియోల్ హనుమంతుడిగా నటిస్తున్న ఈ మెగా ప్రాజెక్టులో ఫైసల్ మాలిక్ చేరడం సినిమాపై అంచనాలను మరింత పెంచింది. త్వరలోనే ఈ భారీ పౌరాణిక చిత్రానికి సంబంధించి మరిన్ని అధికారిక వివరాలు వెల్లడి కానున్నాయి.

# ‘విశ్వనాథ్ & సన్స్” టీజర్ రిలీజ్...

## షూటర్ జీవితంతో ప్రేమకథ కలిపి వెంకీ అట్లూరి కొత్త ప్రయోగం

సౌత్ స్టార్ హీరో సూర్య నటిస్తున్న తాజా చిత్రం “విశ్వనాథ్ & సన్స్” పై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. ప్రతిభావంతుడైన దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై ప్రముఖ నిర్మాత నాగవంశీ నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ సినిమాను సమర్పిస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన టీజర్‌ను మేకర్స్ విడుదల చేయగా, అది సోషల్ మీడియాలో మంచి స్పందనను అందుకుంటోంది. టీజర్‌ను పరిశీలిస్తే ఇది సాధారణ కమర్షియల్ సినిమా కాకుండా భావోద్వేగాలతో నిండిన స్పోర్ట్స్ డ్రామాగా ఉండబోతుందని అర్థమవుతోంది. ముఖ్యంగా ఓ షూటర్ స్పోర్ట్స్ పర్సన్ జీవితాన్ని, అతని కష్టాలు, విజయాలు, వ్యక్తిగత జీవితం చుట్టూ కథ నడుస్తున్నట్టు టీజర్‌లో చూపించారు. ఇందులో హీరో పాత్రకు గాఢమైన భావోద్వేగాలు, జీవితంలో ఎదురైన పోరాటాలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఈ చిత్రంలో సూర్యకు జంటగా యువ నటి అమిత బైజు నటిస్తోంది. టీజర్‌లో వీరి మధ్య ఉండే ప్రేమకథ కూడా కథలో కీలక పాత్ర పోషించనున్నట్టు సంకేతాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా హీరో 40 ఏళ్ల వయసులో ఎదుర్కొనే ప్రేమకథను దర్శకుడు చాలా హృద్యంగా చూపించబోతున్నట్టు టీజర్ ద్వారా తెలుస్తోంది. ఈ అంశం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అభిమానులు భావిస్తున్నారు.

టీజర్‌లో విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కూడా ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. షూటింగ్ రేంజ్‌లో జరిగే సన్నివేశాలు, స్పోర్ట్స్ నేపథ్యంతో రూపొందించిన సన్నివేశాలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. వెంకీ అట్లూరి గత చిత్రాల మాదిరిగానే ఈ సినిమాలో కూడా భావోద్వేగాలను ప్రధానంగా చూపించబోతున్నట్లు టీజర్ స్పష్టం చేస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. మేకర్స్ ఇప్పటికే ఈ చిత్రాన్ని జూలైలో విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. స్పోర్ట్స్, ప్రేమ, భావోద్వేగాల మేళవింపుగా తెరకెక్కుతున్న “విశ్వనాథ్ & సన్స్” సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించనుందా అనేది చూడాలి. టీజర్ మాత్రం సినిమాపై మంచి అంచనాలను క్రియేట్ చేసింది.



# వింటేజ్ పవర్‌స్టార్‌ని చూస్తారు

‘పవన్‌కల్యాణ్ సినిమా అనగానే కథ కూడా వినకుండా ఓకే చెప్పాను. ఇండస్ట్రీకి వచ్చిన నాటి నుంచి పవన్ స్టార్‌డమ్ గురించీ, పవనిజం గురించి వింటూవుండేదాన్ని. ఆయనతో ఒక్క సినిమా అయినా చేయాలని కలలు కనేదాన్ని. ‘ఉస్తాద్ భగత్‌సింగ్’తో నా కల నిజమైంది’ అంటూ ఆనందం వెలిబుచ్చింది నటి రాశీఖన్నా. పవన్‌కల్యాణ్‌కి జోడీగా ఆమె నటించిన ‘ఉస్తాద్ భగత్‌సింగ్’ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం రాశీఖన్నా మీడియాతో ముచ్చటించింది. “గబ్బర్‌సింగ్’ లాగే ఇది కూడా చాలా ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుంది. ఇదొక ఫ్యామిలీ సినిమా. ఇందులో వింటేజ్ పవర్‌స్టార్‌ని చూస్తారు. ఇందులో నా పాత్ర పేరు శ్లోక. మోడరన్ అమ్మాయి. కథలో ప్రాధానత్య ఉన్న పాత్ర. దర్శకుడు హరీశ్‌శంకర్ ఈ సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దారు. ఆయన చాలా స్మార్ట్. మాస్ పల్స్ తెలిసిన డైరెక్టర్. సాధారణంగా 120రోజులు పట్టే షూటింగ్‌ని కేవలం 40 రోజుల్లో పూర్తి చేశారు. సరిగ్గా నిద్ర కూడా పోకుండా ఈ సినిమాకోసం కష్టపడ్డారు. లొకేషన్లోనే డైలాగులు కూడా రాసిచ్చేవారు. వృత్తిపట్ల ఆయనలోని అంకితభావం నన్నెంతో ఆకర్షించింది.మేం కూడా పవన్‌కల్యాణ్ టైమింగ్స్‌కి అనుగుణంగా పగలు రాత్రి తేడా లేకుండా కొన్నిసార్లు 24గంటల షిఫ్టులు పనిచేశాం’ అని తెలిపింది రాశీఖన్నా. శ్రీలీల కాంబినేషన్ సీన్స్ తనకు లేవని, ప్రతి పాత్రా దేనికదే ప్రత్యేకంగా ఉంటుందని, మైత్రీ అధినేతలు నవీన్, రవిశంకర్ సినిమాకోసం ప్రాణం పెట్టే నిర్మాతలని, బడ్జెట్ విషయంలో రాజీ పడరని, ఈ సంస్థలో మళ్లీ మళ్లీ సినిమాలు చేయాలనుందని ఆశాభవం వ్యక్తం చేసింది రాశీఖన్నా.

# పదేళ్ల నిరీక్షణకు తెర..

## త్వరలో తల్లి కాబోతున్న పాపులర్ నటి.!



బాలీవుడ్ బుల్లితెర మోస్ట్ పాపులర్ జంట దివ్యాంక త్రిపాఠి, వివేక్ దహియా త్వరలోనే తల్లిదండ్రులు కాబోతున్నట్లు తెలుస్తుంది. దీనికి సంబంధించిన వార్తలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 2016 జూలై 8న వివాహం చేసుకున్న ఈ జంట, పెళ్లయిన పదేళ్ల తర్వాత తమ మొదటి బిడ్డను ఆహ్వానించడానికి సిద్ధమవుతున్నట్లు జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ‘యే హై మొహబ్బతేన్’ సీరియల్ సెట్స్‌లో మొదలైన వీరి ప్రేమ ప్రయాణం పెళ్లి పీటల వరకు వెళ్ళింది. ప్రస్తుతం దివ్యాంక ఆరో నెల గర్భవతి అని, ఈ ఏడాది జూన్ నెలలో ఆమె ప్రసవం ఉండవచ్చని సన్నిహిత వర్గాల నుంచి సమాచారం. ఈ క్రమంలో ముంబైలో దివ్యాంక సీమంతం (బేబీ షవర్) వేడుకను అత్యంత సన్నిహితుల మధ్య నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో కూడా దివ్యాంక గర్భం గురించి పలుమార్లు పుకార్లు వచ్చినప్పటికీ, ఈసారి ఆమె గత కొంతకాలంగా షూటింగులకు దూరంగా ఉండటం, సోషల్ మీడియాలో పెద్దగా కనిపించకపోవడంతో ఈ వార్తలు నిజమేనని అభిమానులు నమ్ముతున్నారు.




# గడపల తోరణాలే గంతులు వేసెనుగా..

కొత్త ప్రతిభను పరిచయం చేయాలనే దృక్పథంతో హీరో కిరణ్ అబ్బవరం తన కేఏ ప్రొడక్షన్స్ పతాకంపై సుమైనా స్టూడియోస్‌తో కలిసి నిర్మిస్తున్న వైవిధ్యకథాచిత్రం ‘తిమ్మరాజుపల్లి టీవీ’. సాయితేజ్, వేద జలంధర్ జంటగా నటిస్తున్నారు.

వి.మునిరాజు దర్శకుడు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ పీరియాడిక్ డ్రామా త్వరలోనే థియేట్రికల్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా సోమవారం ఈ సినిమా నుంచి ఓ పాటను విడుదల చేశారు. ‘కొమ్మ కొమ్మల్లో కోయిల కూయంగ, తెల్లవారే మా పల్లె పచ్చపచ్చంగ.. ఎచ్చని ఎలుగు సీరే కట్టే సక్కంగ.. ముగ్గుల పూలు పెట్టి మెరిసే అందంగా.. గడపల తోరణాలే గంతులు వేసెనుగా.. పూవుల పరిమళాలే గాలులు వీచెనుగా.. ముస్తాబవుతున్నాదీ శివరాతిరి పండక్కి ఊరు.. చిన్నాపెద్దల్లోన మొదలయ్యెను జాతర జోరు..’ అంటూ పల్లెల్లో జరిగే శివరాత్రి పర్వదినాన్ని ఆవిష్కరిస్తూ ఈ పాట సాగింది. ప్రదీప్ కొట్టె, స్వాతి కరిమిరెడ్డి, అమ్మ రమేష్, సత్యనారాయణ, లతీష్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అక్షయ్‌రామ్ పొడిశెట్టి, సంగీతం: వంశీకాంత్ రేఖన.

# హృతిక్ రోషన్ కొత్త సాహసం..

## సోదరుడు ఈషాన్‌తో కలిసి క్రేజీ కామెడీ మూవీ!



బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ తన సోదరుడు ఈషాన్ రోషన్‌తో కలిసి సినీ నిర్మాణ రంగంలో సరికొత్త అడుగులు వేస్తున్నాడు. వీరిద్దరి కలయికలో ‘మెస్’ అనే క్రేజీ కామెడీ ఎంటర్టైనర్ రాబోతుండగా.. హృతిక్ రోషన్ తన సొంత బ్యానర్ ‘ఎ=శ ఫిలిమ్స్’ ద్వారా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. ఈషాన్ రోషన్ ఈ ప్రాజెక్టులో కీలక భాగస్వామిగా వ్యవహరిస్తున్నాడు. ఈ సినిమా కథ విషయానికి వస్తే . ఒక దొంగల ముఠా ఒక ఇంట్లోకి చోరీ కోసం ప్రవేశించగా, ఆ ఇంటి యజమాని OCDతో బాధపడుతుంటాడు. అయితే ఇంటి యజమాని పెట్టే తిప్పలకు దొంగలు ఎలా ఇబ్బంది పడ్డారు, అక్కడి నుంచి వారు ఎలా తప్పించుకున్నారనే అంశాలతో దర్శకుడు రాజేష్ కృష్ణన్ పూర్తిస్థాయి కామెడీతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. రాజేష్ కృష్ణన్ గతంలో ‘లూట్‌కేస్’, ‘క్రూ’ వంటి చిత్రాలతో విజయాలు అందుకున్నాడు. మరోవైపు హృతిక్ రోషన్ తన సోదరుడిని నిర్మాతగా పరిచయం చేస్తూ అమెజాన్ ప్రైమ్ వీడియో కోసం ఈ భారీ ప్రాజెక్టును పట్టాలెక్కించడం ప్రస్తుతం బాలీవుడ్‌లో హాట్ టాపిక్ అయింది. వీరు ఇప్పటికే ప్రైమ్ వీడియోతో కలిసి ‘స్టార్మ్’ అనే వెబ్ సిరీస్‌ను కూడా ప్రకటించారు. నేరుగా ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లో విడుదల కానున్న ఈ ‘మెస్’ సినిమా షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది. త్వరలోనే ఈ చిత్రంలో నటించబోయే ఇతర నటీనటుల వివరాలను చిత్ర యూనిట్ అధికారికంగా వెల్లడించనుంది.

PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154